బుధవారం
15-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 262
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కొత్త రాష్ట్రాల ప్రతిపాదన లేదు

న్యూఢిల్లీ: కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే విషయంలో కేంద్రప్రభుత్వం పరిగణనలో ఎలాంటి ప్రతిపాదన లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మంగళవారం లోక్‌సభకు తెలిపారు. బుందేల్‌ఖండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రతిపాదన కూడా లేదని రాతపూర్వకంగా సభకు వెల్లడించారు. 'కొత్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి అనేక ఫోరాలు, సంస్థల నుంచి ప్రతిపానదలు, విజ్ఞప్తులు వచ్చాయి. ప్రస్తుతానికి కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనను కేంద్రం పరిగణించడం లేదు' అని రాయ్ పేర్కొన్నారు.

రేపు రాష్ట్ర బడ్జెట్

- 24 వరకు అసెంబ్లీ సమావేశాలు
- 21, 22 తేదీల్లో సెలవు: బీఏసీ నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మొత్తం 9 రోజులు నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభల నుద్దేశించి మంగళవారం ప్రసంగించిన అనంతరం సభ వాయిదా పడింది. ఆ తర్వాత స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఆధ్వర్యంలో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేశ్, చీఫ్‌విప్ ప్రసాదరాజు, శ్రీకాంత్ రెడ్డి, కింజరాపు అచ్చెన్నాయుడు, శాసనమండలి కార్యదర్శి బాలకృష్ణమాచార్యులు పాల్గొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు మొత్తం 9 రోజుల పాటు ఈ సమావేశాలను నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఈ నెల 16వ తేదీన అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఉగాది సందర్భంగా ఈ నెల 21, 22న అసెంబ్లీకి సెలవు ఉంటుంది.

చైర్మన్ల పదవి ఇక రెండేళ్లే

- అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఏర్పాటు
- దేవాలయాల పాలక మండలిలో నాయీబ్రాహ్మణులు 2లో
- మీడియా అక్రిడిటేషన్ నిబంధనల సవరణకు ఆమోదం

జులైలో విశాఖకు...

- పాలనపై మారిన వ్యూహం
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల గెలుపు బాధ్యత మంత్రులదే
- తేడాలొస్తే కేబినెట్ నుంచి తొలగిస్తా
- మంత్రిమండలి సమావేశంలో సీఎం జగన్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉగాది పండుగ నాటికి సీఎం క్యాంపు కార్యాలయం విశాఖకు తరలించాలనే యోచనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జులైకి మార్చుకున్నారు. ఈనెల 28వ తేదీన సుప్రీంకోర్టులో అమరావతి రాజధానిపై విచారణ ఉన్నందున ఈ మార్పు చేసినట్లు కనపడుతోంది. ఈ విషయం మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి స్వయంగా మంత్రులకు చెప్పినట్లు తెలిసింది. అలాగే శాసన సభ్యుల కోటాలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు తాజా రాజకీయ పరిణామాలు, కొన్ని కీలక అంశాలను సీఎం మంత్రులతో ప్రస్తావించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కచ్చితంగా గెలవాలని, ఇందుకు మంత్రులదే పూర్తిబాధ్యతని స్పష్టం చేశారు. శాసనసభ్యుల కోటా కింద టీడీపీ నుంచి పంచుమర్తి అనురాధ నామినేషన్ దాఖలు చేయడం, మాజీ హోంమంత్రి చినరాజప్ప క్రాస్ ఓటింగ్ జరగబోతోందని చేసిన వ్యాఖ్యలతో మంత్రులకు సీఎం జగన్ క్లాసు తీసుకున్నారు. అందరి పని తీరును గమనిస్తున్నానని మంత్రులతో అన్నారు. తేడాలొస్తే మంత్రులను మార్చేస్తానని తీవ్ర హెచ్చరిక చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలను గెలిపించే కర్తవ్యాన్ని మంత్రులకు అప్పగిస్తూ, ఒక్కో మంత్రికి ఆరుగురు ఎమ్మెల్యేల బాధ్యతను అప్పగించారు. ఇచ్చిన బాధ్యతలు సరిగ్గా నిర్వహించకపోతే పరిస్థితులు వేరేలా ఉంటాయని హెచ్చరించారు. మంత్రుల తీరు బాగాలేకపోతే ఇద్దరు, ముగ్గుర్ని పదవుల నుంచి తప్పించడానికి సైతం వెనకాడబోనని సీఎం చెప్పినట్లు సమాచారం. స్వయంగా సీఎం జగనే ఈ వ్యాఖ్యలు చేయడంతో మంత్రుల్లో ఆందోళన మొదలైంది. దీంతో కేబినెట్ నుంచి ఎవర్ని తొలగిస్తారనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అంతేకాకుండా శాఖాపరంగా, పనితీరు ఆధారంగా మార్పులు, చేర్పులు ఉంటాయని ఇంకొందరు మంత్రులను జగన్ పరోక్షంగా హెచ్చరించినట్లు సమాచారం.

దద్దరిల్లిన పార్లమెంట్

- రాహుల్ క్షమాపణకు బీజేపీ డిమాండ్
- ప్రధాని వ్యాఖ్యలకు విపక్షాల కౌంటర్
- పోటాపోటీ నినాదాలు
- సాగని కార్యకలాపాలు
- ఉభయ సభలలో వాయిదాల పర్వం

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ కోసం పార్లమెంటులో విపక్షాలు ఐక్యంగా డిమాండ్ చేశాయి. కానీ కేంద్రప్రభుత్వం వారి గొంతు నొక్కేస్తూ ఆ వ్యవహారంలో ఈ డిమాండ్ చేయనివ్వలేదు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బ్రిటన్‌లో మాట్లాడుతూ దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్ఠపాల్జేశారంటూ అధికారపక్ష సభ్యులు విరుచుపడ్డారు. ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ అంశం పార్లమెంటును కుదిపివేసింది. రెండవ రోజైన మంగళవారం లోక్‌సభ, రాజ్యసభలో వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు బుధవారానికి ఉభయ సభలు వాయిదా పడ్డాయి.

లోక్‌సభ ఉదయం సమావేశమైనప్పుడు రాహుల్ గాంధీ దేశానికి, చట్టసభలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. ప్రధాని మోదీ విదేశాల్లో చేసిన ప్రసంగాల్లోని వ్యాఖ్యలతో విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'రాహుల్ మాఫీ మాంగో' (రాహుల్ క్షమాపణ చెప్పు)' అని బీజేపీ సభ్యులు తమ స్థానాల్లో నిలుచొని బిగ్గరగా అరిచారు. విపక్ష సభ్యులు కౌంటర్ నినాదాలు చేశారు. ఎవరూ వెల్‌లోకి వెళ్లలేదు. 'బ్రిక్స్ కా ఐ లుడక్ రహా హై' (బ్రిక్స్‌లోని ఐ దొర్లిపోతోంది' అని బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సంఘాన్ని - మిగతా 2 లో

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్మీడియట్ విద్యామండలి వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు 15 నుంచి, ద్వితీయ సంవత్సర పరీక్షలు 16 నుంచి నిర్వహించనున్నారు. ఈ పరీక్షల హాల్‌టికెట్లను ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ప్రథమ/ద్వితీయ సంవత్సర పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఇంటర్ **ప్రథమ సంవత్సర పరీక్షల వివరాలివీ...** ఈనెల 15న ద్వితీయ లాంగ్వేజీ పేపర్-1, 17న ఇంగ్లీషు - మిగతా 2 లో

పోలవరం ఎత్తు తగ్గించొద్దు

- నిర్వాసితులకు పరిహారమివ్వాలి
- నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి
- జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుకు సీపీఐ నేత విల్సన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వార్షిక బడ్జెట్ (2023-24)లో నీటి పారుదల రంగానికి 15శాతం నిధులు కేటాయించి పూర్తిగా ఖర్చుచేయాలని, పోలవరాన్ని ఎత్తు తగ్గించకుండా, ప్రతిపాదిత ఎత్తుతో నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ నీటి పారుదలశాఖ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబును ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. పోలవరం నిర్మాణం కేంద్రమే - మిగతా 2 లో

అన్నిచోట్ల రీపోలింగ్ జరపాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో ఈసీ ఘోర వైఫల్యం
- డబ్బు పంపిణీ ఎందుకు...
- మీటనొక్కి ఖాతాలో వేయొచ్చుగా
- జగన్‌పై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రమంతా రీపోలింగ్ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్నికలు సజావుగా జరపడంలో రాష్ట్ర ఎన్నికలసంఘం విఫలమైందని విమర్శించారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో కలిసి రామకృష్ణ మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. శాసనమండలి ఎన్నికలను ఏ ముఖ్యమంత్రి ఇంతగా దిగజార్చలేదని, రాజకీయ బకాసురుడిగా సీఎం జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికలోనూ గెలవాలన్న దుర్బుద్ధితోనే జగన్ అక్రమాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. దొంగఓట్ల కోసం చదవని వారికి డిగ్రీ పట్టాలు, పెళ్లి కాని వారికి ఒక్కొక్కరికి పదిమంది భర్తలను సృష్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పెద్దలసభ ఎన్నికలో అక్రమ సారా అమ్ముకునే వారిని అభ్యర్థులుగా నిలబెట్టడం, ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసి దొంగ ఓట్లు వేయించడం సిగ్గుచేటన్నారు. స్వయానా వైసీపీ నాయకులే పోలింగ్ కేంద్రాల వద్ద డబ్బులు - మిగతా 2 లో

కొల్లేరు పాపం ఎవరిది?

- కబ్జా చెరలో 75 శాతం కొల్లేరు సరస్సు
- కబ్జారాజులకు నేతలు, అధికారుల అండదండలు
- నాడు కాంగ్రెస్, ఆ తర్వాత టీడీపీ... ఇప్పుడు వైసీపీ
- ఆక్రమణదారుల దందాలు... దమ్ములేని అధికారులు

(విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి-విజయవాడ) అలనాటి సువిశాలమైన కొల్లేరు నేడు ఆక్రమణలతో కుంచించుకుపోయింది. చేతిలో డబ్బులు, పాలకపక్షం అండదండలు ఉంటే చాలు.. అధికారుల కనుసన్నల్లోనే కొల్లేరును మింగేయవచ్చు. పలుగూపార పట్టుకొని ఎవరైనా కొల్లేరుకు వెళ్లి, తనకు నచ్చిన స్థలంలో తవ్వుకొని చేపల చెరువుగా మార్చేయొచ్చు. కాకపోతే వారికి అంగ, అర్థబలం ఉండాలి. కొల్లేరు ప్రాంతమంతా ఒకప్పుడు వ్యవసాయంతో సమృద్ధిగా ఉండేది. 1969లో వచ్చిన తుపాన్ తర్వాత పరిస్థితి మారింది. ముంపు, కాలుష్యం పెరగడంతో వ్యవసాయం ముందుకు సాగడం లేదు. 1976లో జలగం వెంగళరావు ప్రభుత్వం జీవో నంబర్ 118 ద్వారా చేపల చెరువుల తవ్వకాలకు దిగింది. రెండు జిల్లాలలో కలిపి 136 సొసైటీలు ఏర్పాటు చేసి చేపల చెరువులకు నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డి ఫారం, జిరాయితీ భూముల్లోనూ చెరువుల తవ్వకం జరిగింది. 1990 తర్వాత రొయ్యల సాగు జోరందుకుంది. పెద్ద స్థాయిలో ఆక్వా సాగు జరగడంతో అన్ సర్వే భూములలోనూ చెరువుల తవ్వకాలు పెరిగాయి. దీన్ని అలుసుగా తీసుకొని... ఇదే సమయంలో కొంతమంది బడాబాబులు కొల్లేరులో భారీగా ఆక్రమణలకు పాల్పడ్డారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు, చేపలు, రొయ్యల వ్యాపారులు రంగప్రవేశం చేశారు. దీంతో సొసైటీలకు ఆదాయం పెరగడంతో పాటుగా కొల్లేరు లంక వాసుల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇది వాస్తవమే. కానీ అసలు కథ ఆ తర్వాతనే మొదలైంది.

ఆపరేషన్ కొల్లేరుతో ఆక్రమణల తొలగింపు

చంద్రబాబు ప్రభుత్వం 1999లో జీవో నంబర్ 12 విడుదల చేసి ఆక్రమణలు తొలగించాలని నిర్ణయం చేసింది. 2006లో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఆ జీవోను అమలు చేసింది. వేల ఎకరాలలో చెరువులు ధ్వంసం చేశారు. కాకపోతే, కొల్లేరు ప్రక్షాళన పేరుతో సాగించిన ఆపరేషన్ కొల్లేరులో ఆక్రమణల తొలగింపు కాకుండా సామాన్యుల భూములు స్వాధీనం చేసుకున్నారని అప్పట్లో స్థానిక రైతులు ఆరోపించారు. అయినా ప్రభుత్వం ముంపు, పర్యావరణ సమస్యల పరిష్కారం కోసం ఆపరేషన్ కొనసాగించింది. ఆ తర్వాత చెరువులు కోల్పోయిన వారికి ప్యాకేజీ ప్రకటించినప్పటికీ అది సక్రమంగా అమలు చేయలేదని కొల్లేరువాసులు ఆరోపిస్తున్నారు. ఇది కూడా నిజమే. ఎందుకంటే, ఈ నష్టపరిహారం ప్యాకేజీలను పాలకపార్టీ నేతలు, స్థానిక నాయకులు, అధికారులు వాటాలేసుకొని గుటకాయస్వాహా చేశారు.

కాంటూరు కుదింపు సాధ్యమేనా

కొల్లేరులో ఐదవ కాంటూరు నుంచి మూడవ కాంటూరుకు కుదించాలని చాలాకాలం నుండి స్థానికులు కోరుతున్నారు. 2014 ఎన్నికలకు ముందు భీమవరం బహిరంగ సభలో నరేంద్ర మోదీ సైతం దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ తర్వాత 2017లో చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో కాంటూరు కుదింపు కోసం తీర్మానం చేసింది. అయితే అది కేంద్రం పరిధిలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపి...చేతులు దులిపేసుకుంది. సముద్ర మట్టానికి ఎగువ, దిగువున ఎంత మేరకు ఉన్నది లెక్కగట్టి కాంటూరు లెక్కిస్తారు. ప్రస్తుతం కాంటూరు-5గా ఉన్న కొల్లేరు పరిధిని కాంటూరు-3కు కుదిస్తే సుమారుగా 40 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. దీనిద్వారా - మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎన్నిసార్లు తరలివెళ్తామని చెపుతారు?
అస్తమానూ నేను నమ్మి
ఈ లగేజి సర్దలేను సార్!

ఎప్పటికైనా జనసేన ప్రభుత్వం

- వైసీపీని గద్దె దించటమే లక్ష్యం: పవన్ కళ్యాణ్
- ఉత్సాహంగా జనసేన 10వ ఆవిర్భావ సభ
- లక్షలాది మంది హాజరు

విశాలాంధ్ర-మచిలీపట్నం: రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దించటమే లక్ష్యంగా జనసైనికులు పని చేయాలని జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభ ఉత్సాహపూరిత వాతావరణంలో కార్యకర్తల కోలాహలం మధ్య మచిలీపట్నంలో మంగళవారం జరిగింది. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ విజయవాడ నుంచి ఊరేగింపుగా మచిలీపట్నం చేరుకున్నారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహానీయుల త్యాగాలను దృష్టిలో పెట్టుకుని మన ఏమైనా చేద్దాం అనే ఆశయంతో పార్టీని స్థాపించినట్లు చెప్పారు. రెండు చోట్ల ఓడిపోయి కూడా పార్టీని ముందుకు తీసుకెళ్లటానికి మహనీయుల స్ఫూర్తితోనే ధైర్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. గెలిచి బలపడటం కాకుండా ఓటమి దెబ్బలు తిని కూడా బలపడటం జనసేనకే సాధ్యమయిందన్నారు. పులివెందులతో సహా రాష్ట్రంలో వేలాది మందిని పార్టీ కోసం పని చేసే వారిని సంపాదించుకోగలిగామని అన్నారు. సభ ప్రారంభానికి ముందుగా ఇటీవల మరణించిన కౌలు రైతుల కుటుంబాలను కలిసి వారికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందించారు. ముందుగా జనసేన పార్టీ రాజకీయ వ్యవహార కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి ప్రజల కోసం చేపట్టిన ఉద్యమాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను తూర్పారబట్టారు. నవరత్నాలు, ఉత్తరాంధ్ర ప్రజల వలసలు, జీవో నంబరు-1 గురించి వివరించారు. సోషల్ మీడియాలో చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. జనసేన క్రియాశీలక సభ్యత్వం పెరిగిందని, ఈ ఏడాది 6,69,350 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

రెండు క్షిపణులు పరీక్షించిన ఉత్తర కొరియా

సియోల్: అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా సైనిక విన్యాశాలు మొదలు పెట్టిన క్రమంలో మంగళవారం రెండు బాలిస్టిక్ మిస్సైళ్లను ఉత్తర కొరియా ప్రయోగించింది. అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాశాలను తమ దేశంపై యుద్ధానికి సన్నాహాలుగా ఉత్తర కొరియా భావిస్తున్న విషయం తెలిసిందే. జాంగ్‌యోన్ కోస్తా పట్టణం నుంచి దగ్గర లక్ష్యాలు ఛేదించే రెండు క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా సంయుక్త చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్రకటన తెలిపింది. 620 కిమీల దూరాన్ని క్షిపణులు ప్రయాణించాయని, తద్వార వీటి లక్ష్యం దక్షిణ కొరియా అని తెలుస్తోందని పేర్కొంది. 28వేల అమెరికా సైనిక దళాలు దక్షిణ కొరియాతో సైనిక విన్యాశాల్లో పాల్గొంటున్నాయి. తాజా ప్రయోగాలతో తమ మిత్రపక్షాలకు ముప్పులేదని అమెరికా ఇండో-పసిఫిక్ కమాండ్ వెల్లడించింది. ఉత్తర కొరియాలో అక్రమంగా ఆయుధాల తయారీ అనిశ్చితిని సృష్టించే ప్రయత్నాల్లో భాగమేనని పేర్కొంది. దక్షిణ కొరియా, జపాన్‌కు అమెరికా రక్షణపై రాజీ లేదని, ఇది కుక్కపిడికితో సమానమని అమెరికా ఇండో-పసిఫిక్ కమాండ్ తెలిపింది.

60 రోజులకు రష్యా ఓకే

నల్లసముద్రంలో ఆహార ధాన్యాల ఎగుమతులపై ఐరాసతో చర్చలో అంగీకారం

జెనీవా: ఉక్రెయిన్‌తో బ్లాక్‌సీ గ్రెయిన్ ఇనిషియేటివ్ (నల్ల సముద్రం గుండా నౌకల్లో ఆహార ధాన్యాల ఎగుమతి ఒప్పందం) మరో 60 రోజులు పొడిగించేందుకు రష్యా అంగీకరించింది. జెనీవాలో ఐరాస ప్రతినిధులతో సమావేశం క్రమంలో ఈ మేరకు అంగీకారం తెలిపినట్లు రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సెర్గీ వెర్షినిన్ ప్రకటించారు. వాణిజ్యం, అభివృద్ధిపై సదస్సు ఐరాస ప్రధాన కార్యదర్శి (మానవతాద వ్యవహారాలు) రెబెకా గ్రిన్స్‌పాన్ అధ్యక్షతన జరిగింది. ఈనెల 18తో ఈ పథకానికి రెండవ పొడిగింపు గడువు ముగియనుంది. అయితే 60రోజుల కోసమే దానిని పొడిగిస్తామని రష్యా స్పష్టంచేసింది. ఈ ఒప్పందం క్రమంలో 24 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు 1600కుపైగా రక్షిత నౌకల్లో నల్ల సముద్రం గుండా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు ఐరాస వెబ్‌సైట్ పేర్కొంది. ఈ ఒప్పందం కాలాన్ని పొడిగించాలని ఉక్రెయిన్ నేతలతో గతవారం కీవ్‌లో జరిగిన సమావేశంలోనూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ అన్నారు. నల్ల సముద్రం గుండా ఆహార ధన్యాల ఎగుమతికి ఐరాస కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. అలాగే రష్యా ఎగుమతుల లబ్ధికి కసరత్తులు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు.

‘రెడ్‌ఆర్మీ’ స్మారకాన్ని తొలగించొద్దు

బల్గేరియాలోని సోఫియా ప్రజల భారీ నిరసన ప్రదర్శన

సోఫియా: బల్గేరియాలోని సోఫియాలోగల సోవియట్ రెడ్‌ఆర్మీ స్మారకాన్ని వేరొక చోటకు తరలించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని స్థానిక అధికారులకు అక్కడి ప్రజలు తేల్చిచెప్పారు. అందుకు తాము ఒప్పుకోబోమని స్పష్టంచేశారు. అరుణ పతాకాలు, బల్గేరియన్ జెండాలతో రోడ్లపైకొచ్చి పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రదర్శనలు, మానవహారాల ద్వారా తమ వ్యతిరేకతను తెలియజేశారు. రెడ్‌ఆర్మీ స్మారకం తరలింపు ఆలోచన మానుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ స్మారకం రాజధాని మధ్యలోని నేషనల్ ప్యాలెస్ ఆఫ్ కల్చర్, సెంట్రల్ పార్క్ వద్ద ఉంది. ఈ స్మారకం ప్రభుత్వఆస్తి కావడంతో ప్రభుత్వ సహకారం, అనుమతి లేకుండా దీనిని తొలగించడం లేదా తరలించే అధికారం సిటీ కౌన్సిల్‌కు లేదు. నాజీల నుంచి సోఫియాకు విమోచనం కల్పించిన సోవియట్ అరుణసైన్యం గౌరవార్థం ఈ స్మారకాన్ని 1954లో ఏర్పాటు చేశారు. ‘సోవియట్ లార్మీ లిబరేటర్లకు-బల్గేరియా ప్రజల నుంచి కృతజ్ఞతగా’ అని స్మారకంపై ఉంది.

పింఛన్ సంస్కరణలు వద్దు

ఫ్రాన్స్‌లో ప్రజలు వర్సెస్ మాక్రాన్

పారిస్: ఫ్రాన్స్‌లోని మాక్రాన్ ప్రభుత్వం తీసుకుకొచ్చిన పింఛన్ సంస్కరణలను ఆ దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఫ్రాన్స్ వర్సెస్ మాక్రాన్ పరిస్థితి నెలకొనివుంది. ఈనెల 7న లక్షలాది మంది ప్రజలు రోడ్లపైకొచ్చి దేశవ్యాప్త సమ్మెచేశారు. 62 నుంచి 64 ఏళ్లకు పదవీ విరమణ వయస్సును పెంచుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన పింఛన్ సంస్కరణను వ్యతిరేకించారు.

ఇది దేశంలో జరిగిన ఆరవ అతిపెద్ద సమ్మె. జనవరి, ఫిబ్రవరిలోనూ భారీగా ఆందోళనలు జరిగాయి. 260 మంది ప్రదర్శనకారులు అరెస్టుకు గురయ్యారు. పారిస్‌లో 7,00,000 మంది నిరసనకారులు పాల్గొన్నట్లు జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సీజీటీ) వెల్లడించింది. ‘పదవీ విరమణ హక్కు: సామాజిక, రాజకీయ ప్రతిస్పందన-నేరం’ శీర్షికన ఫ్రాన్స్ కమ్యూనిస్టు రివల్యూషనరీ పార్టీ (పీసీఆర్ఎఫ్) ఓ వ్యాసాన్ని ప్రచురించింది. అందులో మాక్రాన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానంపై ఉద్యమం గురించి తెలిపింది. మాక్రాన్ ప్రభుత్వం మరింత బలహీనమవుతుందని హెచ్చరించింది. ఈ సమస్యకు ఫ్రాన్స్ కమ్యూనిస్టు రివల్యూషనరీ పార్టీతోనే సమాధానం సాధ్యమని నొక్కిచెప్పింది. సోషలిజం-కమ్యూనిజం వర్థిలాలని నినాదమిచ్చింది.

కొల్లేరు పాపం ఎవరిది?

(మొదటిపేజీ తరువాయి)

స్థానికులకు ఉపాధి లభిస్తుందని రైతుల వాదన. కాంటూరు కుదింపు ఈ ప్రాంత ప్రజల సుదీర్ఘ డిమాండ్. అనేకమార్లు ప్రభుత్వానికి చెప్పిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు కూడా హామీ ఇచ్చారు. కానీ ఈ హామీలు నీటిమూటలయ్యాయి. కాంటూరు కుదింపు తర్వాత 70 వేల ఎకరాలకు పైగా కొల్లేరు కింద సాగుభూమి మిగులుతుంది. దానిని పర్యావరణపరంగా సక్రమంగా అభివృద్ధి చేస్తే అందరికీ మేలు జరుగుతుంది. కాంటూరు రీ సర్వే చేసి పారిశ్రామిక ఇతర వ్యర్థాలు అరికట్టి అటు పర్యావరణం ఇటు ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్న మాట వాస్తవమే. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అసలేమాత్రం కొల్లేరు గురించి పట్టించుకోకపోగా, వైసీపీ నేతలు వారినీ వీరినీ బెదిరించి తలా కొన్ని ఎకరాలు పంచుకొని అక్రమ రొయ్యలసాగు మొదలుపెట్టారు.

ఈ పాపంలో సింహభాగం వారిదే

ఇవన్నీ ఒకెత్తయితే..ప్రభుత్వాల అలక్ష్యం, అధికారుల అవినీతి, స్థానిక ప్రజల్లో భయం..వెరసి కబ్జారాజులు దురాక్రమణలతో దూసుకుపోవడానికి కారణమయ్యాయి. గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టు ఇచ్చిన తీర్పులు అమలు చేయాలన్న ఆసక్తి ప్రభుత్వ యంత్రాంగానికి లేకపోవడం మరో దురదృష్టకర అంశం. దీంతో కొల్లేరు దురాక్రమణ పాపంలో తిలాపాపం తలాపిడెకెడు అన్నట్లుగా రాజకీయ నాయకులు, అధికారులు, ఆక్రమణదారులు తమ తమ పాత్ర గణనీయంగా పోషించారు. ఈ పాపంలో సింహభాగం వీరిదే. అయితే స్థానికులు ఎదిరించినా, పర్యావరణవేత్తలు గట్టిగా పట్టుబట్టినా...కొల్లేరును కాపాడగలిగేవారు. కానీ అదేదీ జరగలేదు. తత్ఫలితంగా మనకు మిగిలింది కేవలం అటుఇటుగా 25% కొల్లేరు సరస్సు మాత్రమే. ఈ పాప ప్రక్షాళనకు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా 5వ కాంటూరులో కబ్జారాజుల ఆగడాలను అడ్డుకోవాల్సిన తరుణమిదేనని గుర్తెరగాలి.

అన్నిచోట్ల రీపోలింగ్ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

పంచుతున్నారని, ఇంతకన్నా జగన్ బటన్ నొక్కి ఓటర్ల ఖాతాలు డబ్బులు పంపితే సరిపోయేదిగా అని రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని పార్టీలను కలుపుకొని పోరాడతామన్నారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సీఎం జగన్‌కు కీలుబొమ్మగా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాజేంద్రనాథ్‌రెడ్డి వచ్చాక పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని మండిపడ్డారు.

శాసనమండలి ఎన్నికల ప్రక్రియను వైసీపీ పూర్తిగా మార్చేసిందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ధ్వజమెత్తారు. తిరుపతిలో వైసీపీ నేతలు భారీగా దొంగఓట్లు వేయించారన్నారు. అధికార పార్టీ అక్రమాలను అడ్డుకునేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై దాడులు చేయడం సరికాదన్నారు. తిరుపతిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిపించాలని, కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ కంటితుడుపు చర్య అని సుగుణమ్మ మండిపడ్డారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య అన్నారు. సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలను రద్దు చేయాలని, దొంగ సర్టిఫికెట్లపై విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులు వైసీపీకి అనుకూలంగా పనిచేశారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని సీపీఎం నేత బాలసుబ్రహ్మణ్యం అన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గసభ్యులు చిన్నం పెంచలయ్య, జె.విశ్వనాథ్, కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశించి ఓ ప్లకార్డును కాంగ్రెస్ నేతలు ప్రదర్శించారు. ‘గతజన్మలో ఏ పాపం చేశాడో. భారతదేశంలో పుట్టాడు’ అని మరొక ప్లకార్డును ఒకరు ప్రదర్శించారు. 2015, మేలో సియోల్‌లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రశ్నోత్తరాలను నిర్వహించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా యత్నించారు. సభ్యుల సహకారాన్ని కోరారు కానీ అది సాధ్యం కాలేదు. సభ ఔన్నత్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ సభ్యులకు సూచించారు. ప్లకార్డులు ప్రదర్శించవద్దన్నారు. ‘ప్రశ్నత్తరాలను జరగనివ్వండి. మీ ప్రశ్నలు అడిగేందుకు అవకాశమిస్తా. పార్లమెంటు కార్యకలాపాల్లో ప్రశ్నోత్తరాలు కీలకం. అందరికి సముచిత అవకాశాలిస్తానుగానీ ప్రశ్నోత్తరాల తర్వాత... మీ స్థానాల్లో కూర్చోండి’ అని బిర్లా అన్నారు. కానీ అధికార-ప్రతిపక్ష సభ్యుల పోటాపోటీ నినాదాలతో సభను హోరెత్తించారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి సమావేశమపైనప్పుడు సభ్యుల ఆందోళనతో గందరగోళం నెలకొంది. అయినప్పటికీ పత్రాలు, స్థాయి సంఘాల నివేదికలను సమర్పించారు. కానీ పది నిమిషాల్లోనే సభ బుధవారానికి వాయిదా పడింది.

అటు రాజ్యసభలోనూ రెండవ రోజు వాయిదాలు సరిపోయాయి. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్‌తో సభ రసాభాస అయింది. మొదటి వాయిదా తర్వాత సభ మధ్యాహ్నం 2గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు పీయూష్ గోయల్ మాట్లాడుతూ రాహుల్ క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. దీనిపై చైర్మన్ జగదీప్ ధన్కర్ స్పందిస్తూ ‘పరిస్థితిని సమీక్షించాం. రాజ్యాంగ నిబంధనలు, మేము రూపొందించిన నియమాలు, చేసిన సూచనలు గత చైర్మన్‌లు విశదీకరించినవే’ అని అన్నారు. ఫ్లోర్ లీడర్లతో తన భేటీని ప్రస్తావించారు. సభ్యులు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా పార్లమెంటును అపఖ్యాతి తెస్తూ, పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకునేందుకు యత్నిస్తే అది కచ్చితంగా దేశానికి క్షమాపణ చెప్పాల్సిన వ్యవహారమని కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ఇదే విషయంలో అధికార-విపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ రసాభాస అయింది. దీంతో రాజ్యసభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

ఇదిలావుంటే ఉభయ సభల్లో అనేక పెండింగ్ బిల్లులు ఉన్నాయి. లోక్‌సభలో తొమ్మిది, రాజ్యసభలో 26 బిల్లులను ఆమోదించాల్సి ఉంది. ఇవి కాకుండా బహుళరాష్ట్ర సహకార సంఘాలు (సవరణ) బిల్లు, 2022, ది జన్ విశ్వాస్ (నిబంధనల సవరణలు) బిల్లు, 2022ను పార్లమెంటు శీతాకాల సమావేశాలప్పుడు సంయుక్త కమిటీకి సిఫార్సు చేశారు. వీటిపైనా చట్టసభల్లో చర్చ జరగాల్సి ఉంది. కాగా బడ్జెట్ ప్రవేశపెట్టిన నెల తర్వాత పార్లమెంటు సమావేశమైంది.

కేంద్రం ఒత్తిడికి తలొగ్గొద్దు

- పోలవరం సత్వర నిర్మాణానికి చర్యలు తీసుకోండి
- వైఎస్ కల నెరవేర్చండి
- జగన్‌కు కేవీపీ రామచంద్రరావు లేఖ

హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేయాలని, ప్రాజెక్టు ఎత్తు తగ్గించడానికి ఎంతమాత్రం అంగీకరించవద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు వైఎస్ రాజశేఖరరెడ్డి చిరకాల స్వప్నమని గుర్తుచేశారు. సీఎం జగన్‌కు కేవీపీ మంగళవారం రాసిన లేఖ వివరాలు ఇలా ఉన్నాయి. ‘పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యత మీకు తెలియనిది కాదు. కారణాలు ఏవైనా పోలవరం ప్రధాన డ్యాం పనులు ముందుకు సాగడం లేదు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ఎప్పటికి పూర్తవుతుందో ప్రభుత్వ వర్గాలే చెప్పలేని పరిస్థితి. పోలవరం పూర్తయితే గోదావరి నీటిని కృష్ణా డెల్టాకి అందించి, ఆ మేరకు కృష్ణా నదిలో మిగిలిన జలాలతో రాయలసీమ జిల్లాల రైతులు, కుడి కాలువ కింద పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల రైతులు, ఎడమ కాలువ కింద తూర్పు గోదావరి, విశాఖలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల రైతులు ఆనందంగా పంటలు పండించుకొనే రోజు వస్తుందని రాజశేఖరరెడ్డి కన్నకల తీరేరోజు... అంతకంతకూ జాప్యం కావడం బాధ కలిగిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడంతో పాటు పోలవరాన్ని పూర్తిగా కేంద్రమే నిర్మించాలని చెపుతున్నది. మోదీకీ-చంద్రబాబుకు అప్పట్లో ఏమి ఒప్పందం జరిగిందో తెలియదు కానీ... ప్రాజెక్టు ఖర్చు భారాన్ని కుదించుకుంటూ... ఆర్థిక భారాన్ని రాష్ట్రంపై మోపుతూ..మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని స్వాగతించి, ఆనందంగా అంగీకరించింది. రాష్ట్రంలో మీ నాయకత్వంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను, పోలవరం నిర్మాణం కోసమే ప్రత్యేకంగా ఏర్పాటైన పోలవరం ప్రాజెక్టు అథారిటీకి అప్పచెపితే... కేంద్రమే నిర్మాణ బాధ్యత చేపడుతుందని...రాష్ట్రంపై ఆర్థికభారం పడకుండా ఉంటుందని నాలాంటి వారు ఆశించినా...ఆ విధంగా జరగలేదు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత రాష్ట్రం తీసుకోవడంతో పోలవరం నిధుల విషయంలో గానీ, ఇతర రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారాల విషయంలో గానీ, ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ఆమోదించే విషయంలో గానీ కేంద్రం చొరవ తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ముఖ్యంగా భూసేకరణ, పునరావాస-పునర్నిర్మాణ పనులకు అవసరమైన దాదాపు 30 వేల కోట్ల రూపాయల ఖర్చుతో తనకు సంబంధం లేనట్లుగానే కేంద్రం వ్యవహరిస్తున్నది. కేంద్రం ఇవ్వకపోయినా, ఆ ఖర్చు రాష్ట్రమే భరించి, ఆ పనులు చేసే ఆర్థిక పరిపుష్టి రాష్ట్రానికి లేదని అర్థమవుతున్నది. ప్రాజెక్టు పూర్తి రిజర్వాయర్ లెవెల్ 140 అడుగులకు కుదించవలసిందిగా కేంద్రం సూచించిందని, దానికి నిధుల కొరత వల్ల రాష్ట్రప్రభుత్వం కూడా అంగీకరించే పరిస్థితి ఉందని వస్తున్న వార్తలు కలవరపరుస్తున్నాయి. పోలవరం పూర్తి రిజర్వాయర్ లెవెల్ 150 అడుగులు లేకపోతే, ఈ ప్రాజెక్టులో నీరు నిలువ చేయడం కుదరదు. దీనివల్ల పోలవరం నుంచి రాష్ట్రం ఆశిస్తున్న పూర్తి ప్రయోజనాలు నెరవేరవన్న విషయం మీకు తెలిసిందే.

పోలవరం రిజర్వాయర్ లెవెల్ 140-150 అడుగుల మధ్య కాంటూర్‌లోనే, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజల పునరావాస-పునర్నిర్మాణ పనులకే పెద్దస్థాయిలో నిధులు కావాలి. ఈ ఖర్చు నుంచి తప్పించుకోవడానికి కేంద్రం పోలవరం ఎత్తును 140 అడుగులుగా ముగించడానికి ప్రయత్నం చేస్తున్నది. ఈ ఖర్చు రాష్ట్రమే పూర్తిగా భరిస్తామని చెప్పినా... కేంద్రం ఈ ఎత్తు తగ్గించేలా రాష్ట్రంపై వత్తిడి చేసే ప్రమాదముంది. పోలవరం పూర్తి ఖర్చు కేంద్రమే భరించాలని, ఈ భారం రాష్ట్రంపై వేయకూడదని నేను రాష్ట్ర హైకోర్టులో నవంబర్ 2017లో ఒక వ్యాజ్యం వేశాను. ఈ వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు కానందున ఆ వ్యాజ్యం ఐదున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 90 ప్రకారం పోలవరం పూర్తి ఖర్చు బాధ్యత కేంద్రానిదే. భవిష్యత్తులో న్యాయస్థానాల ఆదేశంతోనైనా పోలవరం పూర్తి ఖర్చు భరించవలసిన అవసరం కేంద్రానికి ఏర్పడవచ్చు. భవిష్యత్తులోనూ ఆ భారం కేంద్రంపై పడకుండా, పోలవరం ఎత్తు కుదించి ప్రాజెక్టు ఖర్చునే తగ్గించేలా కేంద్రం ప్రణాళికలు రచించే అవకాశం లేకపోలేదు. పోలవరం నిర్మాణం ప్రస్తుతం రాష్ట్రం చేతిలోనే ఉన్నందున దాని ఎత్తు తగ్గించడానికి కేంద్రం ఎంత వత్తిడి చేసినా, ఇతర రాష్ట్రాల అభ్యంతరాలనో, భూసేకరణ, పునరావాస-పునర్నిర్మాణాలకు పెద్దమొత్తంలో కావల్సిన నిధులనో- కారణంగా చూపినా, ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించవద్దని కోరుతున్నాను. గోదావరి ట్రిబ్యునల్ 1980లో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కేంద్రజలసంఘం అనుమతి ఇచ్చిన విధంగా పోలవరం రిజర్వాయర్ లెవెల్ 150 అడుగులు ఉండేలా వైయస్ రాజశేఖరరెడ్డి అనుక్షణం పరితపించిన పోలవరాన్ని పూర్తిస్థాయిలో త్వరితగతిన నిర్మించి, పోలవరం పూర్తి ప్రయోజనాలు రాష్ట్ర ప్రజలకు అందించడానికి మీరు కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నాను. ఈ విషయంలో రాజీపడితే రాష్ట్రానికి ద్రోహం చేసినట్లే అవుతుందనే ప్రజల అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకోమని సూచిస్తున్నాను’ అని కేవీపీ రామచంద్రరావు తెలిపారు.

చైర్మన్ల పదవి ఇక రెండేళ్లే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ, బీసీ, మైనార్టీ, మహిళా కమిషన్ చైర్మన్ల పదవీ కాలాన్ని రెండేళ్లకు కుదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏపీ సచివాలయంలో మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో 45 అంశాలపై చర్చించగా, 15 అంశాలను ఆమోదించింది. సమావేశం అనంతరం సమాచార శాఖ కమిషనర్ విజయ్‌కుమారెడ్డితో కలసి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వివరాలు వెల్లడించారు.

ఏపీ కేబినెట్‌లో ఆమోదించిన కీలక వివరాలివీ...

- ఆంధ్రప్రదేశ్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబల్ యాక్ట్-2019 సవరణలకు సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లుకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్ అండ్ ట్రైబల్ సబ్ ప్లాన్ (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు, వినియోగానికి సంబంధించి) యాక్ట్-2013 సవరణల డ్రాఫ్ట్ బిల్లుకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ యాక్టు 2019 సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం. చైర్మన్, సభ్యుల పదవీకాలాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని, పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అదనంగా మరో రెండేళ్లు పొడిగించే నిర్ణయాన్ని ఆమోదించింది.
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కమిషన్ యాక్టు-1998 సవరణ బిల్లును ఆమోదించింది. కమిషన్ పదవీ కాలాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి, అలాగే పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అదనంగా మరో రెండేళ్లు పొడిగించేలా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసింది.
- ఏపీ మహిళా కమిషన్ పదవీ కాలాన్ని ఐదేళ్ల నుంచి రెండేళ్లకు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శక నియమావళిని అనుసరించి వక్ఫ్ రూల్స్ సవరణకు ఆమోదం.
- ఏపీ కార్ల్-పులివెందులలో అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం.
- జిల్లా గ్రంథాలయాల సిబ్బంది, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంపు.
- ప్రభుత్వ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌ల నియామకానికి ఆమోదం. మొత్తం 5,388 హైస్కూళ్లలో పేరెంట్స్ కమిటీ ద్వారా వాచ్‌మెన్‌ల నియామకం. ఒక్కొక్కరికీ రూ.6 వేల గౌరవ వేతనాన్ని టీఎంఎఫ్ నుంచి చెల్లించాలని నిర్ణయం
- ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్-2019కు మార్పులు చేస్తూ... సమగ్ర నూతన విధానానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం
- వైఎస్ఆర్ స్టీల్ కార్పొరేషన్‌కు నీటిసరఫరాకు అవసరమైన పైప్‌లైన్ ఏర్పాటుకు కావాల్సిన 29.67 ఎకరాలను కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి, నాలుగులైన్ల రహదారి నిర్మాణానికి 78.46 ఎకరాల భూమి కేటాయింపునకు ఆమోదముద్ర.
- నూతన పారిశ్రామికాభివృద్ధి పాలసీ 2023-27కు ఆమోదం, పులివెందులలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నిర్ణయం
- అమలాపురం కేంద్రంగా అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథార్టీ ఏర్పాటుకు ఆమోదం రెండు పట్టణ స్థానిక సంస్థలు, 120 రెవెన్యూ గ్రామాలతో కూడిన 11 మండలాలతో కలుపుకుని మొత్తం 896.16 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు
- ఏపీ లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో సెక్రటరీ జనరల్ పోస్టు భర్తీకి కేబినెట్ ఆమోదం. లోక్‌సభ, రాజ్యసభలలో పదవీ విరమణ చేసిన లేదా ప్రస్తుతం సర్వీసులో ఉన్న సెక్రటరీ జనరల్ ఈ పోస్టుకు అర్హత.
- కొత్తగా ఏర్పాటు చేసిన 6 మండలాలు (అనపర్తి, పిడుగురాళ్ల, మైదుకూరు, మైలవరం, ఉదయగిరి, నిడదవోలు) లో అవుట్ సోర్సింగ్ విధానంలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ లో 18 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్.
- అన్ని దేవస్థానాల బోర్డులలో ఒక నాయీ బ్రాహ్మణుడు సభ్యుడిగా నియామకం. దేవాలయాల్లో క్షుర ఖర్మలు చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీసం నెలకు రూ.20 వేల కమీషన్ అందించాలన్న ప్రతిపాదన. కనీసం వంద పనిదినాల క్షురకులకు ఇది వర్తిస్తుంది.
- ఏప్రిల్ 1న రిజర్వు బ్యాంకు సెలవు, 2న ఆదివారం కావడంతో 3న పెన్షన్లు పంపిణీకి నిర్ణయం
- నాటు... నాటు పాట... ఆస్కార్ అవార్డు సాధించిన నేపథ్యంలో ఆర్ఆర్ఆర్ చిత్ర బృందానికి మంత్రి మండలి అభినందించింది.

జగన్ రావాల్సిందే

- కోడికత్తి కేసులో ఎన్ఐఏ కోర్టు ఆదేశం
- వచ్చే నెల 10కి తదుపరి విచారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కోడికత్తి కేసులో విచారణకు హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎన్ఐఏ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 10న విచారణకు హాజరుకావాలని విజయవాడ ఎన్ఐఏ కోర్టు స్పష్టం చేసింది. సీఎంతో పాటు పీఏ నాగేశ్వరరెడ్డి కూడా హాజరుకావాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కోడికత్తి కేసుపై విజయవాడ ఎన్ఐఏ కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెల్సిందే. ఎయిర్‌పోర్ట్ అథారిటీ కమాండర్ దినేష్‌ను ఎన్ఐఏ విచారించింది. కేసుకు సంబంధించి కోడికత్తి, మరో చిన్నకత్తి, పర్సు, సెల్‌ఫోన్‌ను పోలీసులు కోర్టుకు సమర్పించారు. తదుపరి విచారణను న్యాయస్థానం ఏప్రిల్ 10కి వాయిదా వేసింది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

పేపర్-1, 20న మ్యాథ్స్-1ఏ, బోటనీ పేపర్-1, సివిక్స్ పేపర్-1, 23న మ్యాథ్స్ పేపర్-1బి, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1, 25న ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, 28న కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1, సోషియాలజీ పేపర్-1, ఫైన్ ఆర్ట్స్ పేపర్-1 పరీక్షలు జరుగుతాయి. 31న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, లాజిక్ పేపర్-1, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్-1(బైపీసీ విద్యార్థులకు), ఏప్రిల్ 3న మోడ్రన్ లాంగ్వేజీ పేపర్-1, జాగ్రఫీ పేపర్-1 పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సర పరీక్షల వివరాలివీ...

16న ద్వితీయ లాంగ్వేజీ పేపర్-2, 18న ఇంగ్లీషు పేపర్-2, 21న మ్యాథ్స్ పేపర్-2ఎ, బోటనీ పేపర్-2, సివిక్స్ పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. 24న మ్యాథ్స్ పేపర్-2బి, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2, 27న ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2, 29వ తేదీన కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2, సోషియాలజీ పేపర్-2, ఫైన్ ఆర్ట్స్-మ్యూజిక్ పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 1న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, లాజిక్ పేపర్-2, మ్యాథ్స్ పేపర్-2 (బైపీసీ విద్యార్థులకు), 4న మోడ్రన్ లాంగ్వేజీ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్, జనరల్, ఒకేషనల్ పరీక్షలు-2023 హాల్ టిక్కెట్లను ఇంటర్మీడియట్ విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ హాల్ టికెట్లను విద్యార్థులు స్వయంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్లలో ఫోటోలు, సంతకాలు, ఇతర సవరణలు అవసరమైన విద్యార్థులు వారి కాలేజీ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు తెలిపారు.

పోలవరం ఎత్తు తగ్గించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యత వహించేలా ఆ దిశగా కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు ఢిల్లీకి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల స్థితిగతులు తెలుసుకోవడానికి సీపీఐ రాష్ట్ర నాయకత్వం ఫిబ్రవరి 13 నుంచి 22 వరకు పర్యటించగా, తమ బృందం దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని తెలుపుతూ...వాటిని మంత్రితో కలిసి జల్లి విల్సన్ చర్చించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలు, పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరగా, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సీపీఐ రాష్ట్ర నాయకత్వం తొమ్మిది రోజులపాటు ఈ మొత్తం ప్రాజెక్టులను పరిశీలించి వచ్చిన తర్వాత ఈనెల 5వ తేదీన రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, ఈ క్రింద తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. పోలవరాన్ని ఎత్తు తగ్గించకుండా ప్రతిపాదిత ఎత్తుతో నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ప్రకారం చెల్లించాలన్నారు. జాతీయ ప్రాజెక్టు అయిన...పోలవరాన్ని కేంద్రమే నిర్మాణ బాధ్యత వహించాలని, నిర్వాసితుల పరిహారం సవరించిన అంచనా ప్రకారం చేయాలన్నారు. అందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లాలన్నారు. ఎగువ తుంగభద్ర నిర్మాణం వల్ల టీబీ డ్యాం ద్వారా హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, కేసీ కెనాల్‌కు జరిగే నష్టాన్ని నివారించేందుకు కేంద్రం వద్ద సమర్థవంతమైన వాదనలు వినిపించి దాన్ని నిలిపివేయించాలన్నారు. గాలేరు-నగరి, సుజల స్రవంతి, తెలుగుగంగ, హంద్రీ-నీవా సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టుల క్రింద ఉన్న రిజర్వాయర్ల అసంపూర్తి పనులు ఈ ఏడాదిలో పూర్తి చేసి కరువు ప్రాంతాలను ఆదుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి చేకూర్చే గుండ్రేవుల, వేదవతి, రాజోలి, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని, వంశధార, నాగావళి నదులపై ఉన్న రిజర్వాయర్లను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే చింతల పూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2లో ఉత్పన్నమైన వివిధ భూ సేకరణ సమస్యల్ని పరిష్కరించి కాల్వల నిర్మాణం వెంటనే పూర్తి చేయలన్నారు. ఈ తీర్మానాల్ని క్రమేపీ పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి అంబటికి జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు.

సమ్మిళిత, సుస్థిర ప్రగతే లక్ష్యం

- నవరత్నాలతో సంక్షేమ పాలన
- భవిష్యత్ తరాల వృద్ధికి నాణ్యమైన విద్య
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ నజీర్
- ప్రసంగంలో కానరాని మూడు రాజధానుల ప్రస్తావన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సమ్మిళిత, సుస్థిర ప్రగతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ మంగళవారం ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల అమలుతో ప్రజలకు సంక్షేమ పాలన అందుతోందని కొనియాడారు. డీబీటీ విధానంతో అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వం సొమ్ము అందిస్తున్నదన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో గణనీయ వృద్ధి సాధించినట్లు చెప్పారు. గ్రామ/వార్డు సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకత, పాలన వికేంద్రీకరణకు వీలుగా ప్రభుత్వం వినూత్న విశిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సేవల బట్వాడా సమర్థవంతంగా, పారదర్శకంగా ఉండేలా చూడటంలో రాష్ట్ర వ్యాప్తంగా గల 15,004 గ్రామ/వార్డు సచివాలయాలు కీలకంగా పనిచేస్తున్నాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాల క్రింద రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ.1.97 లక్షల కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహకర ధోరణిలో ఉందని, 2022-23 ముందస్తు అంచనాలు ప్రస్తుత ధరలలో 16.22 శాతం సమగ్ర వృద్ధిని సూచిస్తున్నాయన్నారు. ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాలు, వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగం చెప్పుకోదగిన వృద్ధి సాధించాయన్నారు. ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం 2021-22లో రూ.1,92,517 నుండి రూ.2,19,518లకు చేరిందని, 2021-22లో 11.43 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటు సాధించినట్లు గవర్నరు వివరించారు. భవిష్యత్ తరాలు లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక సంస్కరణలను అమలు చేస్తున్నామన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా తల్లిదండ్రుల పేదరికం పిల్లల చదువుకు అడ్డంకిగా ఉండకూడదనే ఉద్దేశంతో 'జగనన్న అమ్మఒడి' కార్యక్రమం క్రింద 44.49 లక్షల మంది తల్లులకు ఆర్థిక సాయం అందించినట్లు గవర్నరు వివరించారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపారు. 'జగనన్న విద్యా దీవెన' కింద మొత్తం ఫీజు తిరిగి చెల్లిస్తున్నట్లు చెప్పారు. డా. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందరికీ ఉచితంగా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందిస్తున్నదన్నారు. 'నవ రత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం క్రింద 30.65 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయడంతోపాటు లబ్ధిదారులకు 21.25 లక్షల గృహాలు మంజూరు చేశామన్నారు. వైఎస్ఆర్ పింఛను కానుక కింద ప్రతి నెలా 64.45 లక్షల మందికి ఇంటి వద్దనే పెన్షన్ సొమ్ము అందజేస్తున్నామన్నారు. మహిళా సాధికారిత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, స్థానిక సంస్థలలో, నామినేటెడ్ పోస్టులు, పనుల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించినట్లు గవర్నరు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాలను గుర్తుచేశారు. వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కాపు నేస్తం పథకాలతో కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. రాజకీయ సాధికారతలో భాగంగా మంత్రి మండలిలో మొదటి విడతలో 56 శాతం, రెండవ విడతలో 70 శాతం పదవులను ఎస్సీ/ఎస్టీ/బీసీ, మైనారిటీలకు ఇచ్చామని, స్థానిక సంస్థల్లోనూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని, విత్తనం దగ్గర నుంచి ఉత్పత్తుల విక్రయం వరకు రైతుకు సహాయపడేలా 10,778 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ జలకళ, జగనన్న పాలవెల్లువ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం సహా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులు, రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టులు కలిపి 14 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈనెల 3, 4 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందని, మొత్తం రూ.13.42 లక్షల కోట్ల పెట్టుబడులకు అవగాహన కుదిరిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్ హబ్‌గా, ఆగ్నేయ ఆసియాకు గేట్‌వేగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని గవర్నరు చెప్పారు. అందుకోసం రామాయపట్నం, భావన పాడు, కాకినాడ, మచిలీపట్నంలలో మరో నాలుగు ఓడరేవులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నేర రేటును నియంత్రించడంలో, హింసను తగ్గించడంలో వినూత్న పోలీసింగ్ చర్యలు శాంతియుత వాతావరణానికి దోహద పడ్డాయన్నారు. రాబోయే రోజుల్లోనూ రాష్ట్రాన్ని మరింత పటిష్టంగా, శక్తివంతంగా చేయడానికి, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని గవర్నర్ చెప్పారు.

టీడీపీ సభ్యుల నిరసన

గవర్నర్‌తో రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చదవించిందని ఆరోపిస్తూ టీడీపీ సభ్యులు సభలో నిరసన తెలిపారు. నీటిపారుదల రంగం గురించి గవర్నర్ ప్రసంగించేటప్పుడు పోలవరం ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏ సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేశారో చెప్పాలని నినాదాలు చేశారు.

వాస్తవాలకు భిన్నంగా గవర్నర్ ప్రసంగం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు రాష్ట్ర గవర్నర్ చేసిన ప్రసంగం వాస్తవాలకు భిన్నంగా ఉందని, నిజానికి అన్ని రంగాల్లో మూడున్నరేళ్లుగా అభివృద్ధి కుంటు పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ చేసిన ప్రసంగం సత్యదూరంగా ఉందని, అన్నిట్లో ఆంధ్రప్రదేశ్ బ్రహ్మాండంగా ముందుకు పోతున్నట్లు చెప్పడం తగదన్నారు. గవర్నర్ చెప్పిన దానికి, వాస్తవాలకు పొంతన లేకుండా పోతోందని, అన్నిరంగాల్లో అభివృద్ధి అన్నారని, ఏ రంగంలో అభివృద్ధి జరిగిందో చెప్పలేకపోయారన్నారు. రాష్ట్రం అంతగా అభివృద్ధి చెందినప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఎందుకు చెల్లించలేక పోతున్నారు?, రాష్ట్రం ఎందుకు అప్పుల్లో కూరుకుపోతోంది? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారని, అందినకాడికి అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. వ్యవసాయదారులు వ్యవసాయం మానేసే పరిస్థితి వచ్చిందని, ఇరిగేషన్ రంగంలో ప్రాజెక్టుల పనులు అటకెక్కాయన్నారు. పారిశ్రామిక రంగం అధోగతి పాలైందని, ఉన్న పరిశ్రమలు కూడా రాష్ట్రాన్ని వదలిపోతున్నాయన్నారు. సామాజిక న్యాయం బ్రహ్మాండంగా జరుగుతోందని చెబుతున్నారనీ వాస్తవానికి అధికారం మొత్తం ఒక సామాజిక వర్గం వద్దే కేంద్రీకృతమైపోయిందన్నారు. ఇలాంటి విచారకర పరిస్థితులు రాష్ట్రాన్ని పట్టిపీడిస్తుంటే... గవర్నర్ మాత్రం రాష్ట్రం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నట్లు ప్రసంగించడం విచారకరమన్నారు.

పారిశుద్ధ్య సెక్యూరిటీగార్డులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: జీవో నంబరు 549 ప్రకారం చిత్తూరు అపోలో ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందికి రూ.16 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, అపోలో ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరంచాలంటూ మంగళ వారం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఓబులేసు మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే శానిటేషన్, సెక్యూరిటీ గార్డులకు, అపోలో నుంచి రావలసిన మొండి బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 549 ప్రకారం 16 వేల రూపాయల వేతనం ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డులకు రూ.13 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 52 మందికి రావలసిన బకాయిలు 48 గంటల్లో చెల్లించాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ నాయకత్వంలో నిరవధిక పోరాటానికి వెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి సత్యమూర్తి, పార్టీ నాయకులు గోపీనాథ్, రమాదేవి, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి చంద్ర, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.వెంకటేష్, యూనియన్ జిల్లా అధ్యక్షులు సి.కె.జయచంద్ర, బ్రాంచ్ కార్యదర్శి, నాయకులు శంకర్, దామోదర్ రెడ్డి, రాజారాం, రవి రెడ్డి, మునిరత్నం, మోహనాంబ, విక్టోరియా, కవిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం కొనసాగించాలని, తరువాత చర్చల అనంతరం సమస్యను ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలో రాష్ట్ర నాయకత్వం నిర్ణయిస్తుందని తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి

- విజయవాడలో నేడు, రేపు అగ్రిగోల్డ్ బాధితుల రిలే దీక్షలు
- 17న సామూహిక సత్యాగ్రహం
- అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు: అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని... నమ్మిన బాధితులకు న్యాయం చేకూర్చాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించి అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించాలని శాసనసభ సమావేశాల సందర్భంగా ముఖ్య మంత్రికి, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసేందుకు విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 15, 16 తేదీలలో రిలే దీక్షలు, 17న సామూహిక సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం డిపాజిట్ దారులను మోసం చేసి ఎనిమిది సంవత్సరాలు దాటిందని, అయినప్పటికీ బాధిత డిపాజిట్‌దారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన యాజమాన్యం మాత్రం రియల్ ఎస్టేట్ సంస్థల పేరుతో అదే తరహా మోసాన్ని కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రంలో సీఐడీ రూపంలో ఒక సమర్థవంతమైన వ్యవస్థ ఉన్నప్పటికీ అగ్రిగోల్డ్ ఆస్తులు కోర్టుకు అటాచ్ చేయడం... యాజమాన్యాన్ని జైలుకు పంపటం తప్ప బాధితులకు ఒరిగిందేమి లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు హాయ్‌లాండ్‌ను కొనుగోలు చేశారని చెప్పిన వైసీపీ ప్రభుత్వం నాలుగు సంవత్సరాలైన దానిపై విచారణ చేపట్టి ఎందుకు నిజాన్ని నిగ్గుతేల్చలేకపోయిందని ప్రశ్నించారు. వారంలో రూ.20 వేల లోపు బాధితులకు న్యాయం చేస్తామన్నారు... 100 వారాల అనంతరం అసోసియేషన్ ఆందోళన తరువాత కొద్దిమొత్తం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారు. ఆరు మాసాలలో పూర్తి న్యాయమన్నారు... నేటికీ దాని ఊసే లేదని ముప్పాళ్ల విమర్శించారు. కంపెనీ యాజమాన్య దుర్మార్గాలను నేను చూసుకుంటానని, కోర్టులో కేసుల విషయం నాది బాధ్యత అని, కంపెనీ ఆర్థిక మోసం కారణంగా మరణించిన వారి కుటుం బాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తానని పాదయాత్ర సందర్భంగా పదే పదే హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి నేడు ఆ హామీని విస్మరించారన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' పర్యటన నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఎవరిని పలకరించినా డిపాజిట్ల సొమ్ము చెల్లించేశాం కదా? ఇంకా గొడవ ఏమిటని చులకనగా మాట్లాడుతున్నారని, కొంతమంది ప్రజాప్రతినిధులు బాధితుల నుంచి అర్జీలు తీసుకోవడానికి కూడా విముఖత చూపిస్తున్నారని ఆయన తెలిపారు. దీంతో బాధితుల్లో తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడులు పెరిగి నిబ్బరాన్ని కోల్పోతున్నారన్నారు. విశ్వాసం సడలి తిరిగి ఆత్మహత్యలు జరిగే పరిస్థితులు పెరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్ సమావేశాలలో రూ.3 వేల కోట్లు కేటాయించి బాధితులకు డిపాజిట్ సొమ్ము చెల్లించాలని, ఏలూరులోని స్పెషల్ కోర్టును అగ్రిగోల్డ్ కేసు ఒక్కదానికే ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రోజు వారి విచారణ చేయించాలని, కాంపిటేటివ్ అథారిటీ కమిటీని సమావేశపరచి అగ్రిగోల్డ్ బాధితులకు కంపెనీ చేసిన అన్ని రకాల మోసాలను సమగ్రంగా పరిశీలించి మొత్తం బాధితులకు పూర్తి న్యాయం చేయాలని, మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సమర్థ అధికారితో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి మొత్తం బాధితులకు న్యాయం చేయాలని తదితర డిమాండ్లతో రిలే దీక్షలు, సామూహిక సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తమ అసోసియేషన్ పోలీసుల అనుమతి తీసుకుందని, బాధితులను ఆపి అడ్డుకో వద్దని పోలీసు శాఖకు సూచించారు. బాధితులకు సత్వర న్యాయం కల్పించి డిపాజిట్‌లు చెల్లిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించాలని, లేనిపక్షంలో జూన్ తరువాత ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, గుంటూరు నగర గౌరవాధ్యక్షులు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, అసోసియేషన్ నగర అధ్యక్షులు పి.సాంబశివరావు, కార్యదర్శి పెదరామయ్య, నాయకులు ప్రసాద్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదంపై ఐక్య ఉద్యమం

- మేధావులు, సామాజిక కార్యకర్తలకు రౌండ్‌టేబుల్ పిలుపు
- 21న విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన
- ప్రైవేటులోనూ రిజర్వేషన్లు సాధించుకుందాం: జల్లి విల్సన్

విశాలాంధ్ర-గుంటూరు: దళితులు, మహిళలు, మైనారిటీలపై మనువాద, మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమంలో ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు, మేధావులు కలిసి రావాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడ ధర్నాచౌక్‌లో ఈ నెల 21న నిరసన కార్యక్రమం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. డీఎస్ఎంఎం, ఏఐడీఆర్ఎం, ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయస్థాయి ఉద్యమానికి మద్దతుగా డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, ఉభయ వ్యవసాయ, కార్మిక, దళిత, గిరిజన ప్రజాసంఘాల అధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు జరగడం సిగ్గుచేటన్నారు. మోదీ సర్కారు దాడులను అరికట్టకపోగా...మరింత ప్రోత్సహిస్తోందని విమర్శించారు. మతోన్మాదుల అండతోనే దాడులు, దౌర్జన్యాలు పెచ్చరిల్లిపోతున్నాయని, భూస్వాములు, పెత్తందారుల ఆగడాలకు హద్దు లేదని అన్నారు. బీజేపీ విధానాలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాన్ని కోల్పోయే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం వలన పేదలు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత, ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు సాధించుకోవాల్సిన అవసరం పేదలపైనే ఉందని జల్లి విల్సన్ స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించి దళిత, గిరిజనుల అభివృద్ధికి, ఉపాధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు సామాజిక గౌరవం, కుటుంబాలకు శాశ్వత ఉపాధి కల్పించే సాగు భూముల పంపిణీ కోసం కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉందన్నారు.

ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 2వ సారి అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, గిరిజన హక్కులను కాలరాస్తూ... ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని నీరుగారుస్తోందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. మోదీ సర్కారు విధానాలపై ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ పాలకుల విధానాలతో దళితులు, ఆదివాసీల ఉనికికి ప్రమాదం ఏర్పడిందన్నారు. జవాబుదారీతనం లేని పాలనా వ్యవస్థపై గ్రామగ్రామాన ప్రచారోద్యమం నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. కరవది సుబ్బారావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ కుల గణన చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత నేత టి.గోవింద్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బత్తుల వీరాస్వామి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, సహాయ కార్యదర్శి కళంగ లక్ష్మణరావు, నాయకులు బూదాల శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు బి.లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి(సీపీఐ) కాబోతు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం(సీపీఎం) నాయకులు అప్పారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. తొలుత ఆంధ్ర మాల్యాద్రి వక్తలకు స్వాగతం పలికారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, ప్రజానాట్యమండలి నగర అధ్యక్షుడు చెవుల పున్నయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు రెంటాల కుమారి, దళిత పరివర్తన సంఘం నాయకులు శ్రీకాంత్, తిక్కన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం - గెలుపుపై ఎవరి ధీమా వారిదే

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై కర్నూలు జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో పోలింగ్ సరళిని తెలుసుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం 12 మంది బరిలో ఉన్నా పోటీ మాత్రం ముగ్గురి మధ్య సాగింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మొదటి వరుసలో ఉన్నట్లు మూడు జిల్లాల నుండి అందిన సమాచారం ఆధారంగా చర్చించుకుంటున్నారు. కత్తి నరసింహా రెడ్డి విజయం అధికార పార్టీకి చెంపపెట్టులా ఉండాలని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులపై అవలంబిస్తున్న వైఖరికి ఈ ఎన్నికల ద్వారా జగన్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరుకుంటున్నారు. ఇదే జరిగితే ప్రభుత్వం ఒక అడుగు వెనక్కి వేసి సీపీఎస్ రద్దు సహా అనేక హామీల అమలుపై పునరాలోచించే అవకాశం ఉంది. మరోవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో అధికారపార్టీ భారీ ఎత్తున డబ్బు ఖర్చు చేసింది. ఓటరుకు డబ్బు పంపిణీ చేయడమే కాకుండా హైదరాబాద్, బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌తోపాటు ఇతర కంపెనీలలో పనిచేసే ఉద్యోగులకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయడం వలన విజయంపై వైసీపీ నేతలు ధీమాతో ఉన్నారు. అధికారపార్టీపై వ్యతిరేకత తమకు లాభిస్తుందని ఇటు నిరుద్యోగులు, అటు టీడీపీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఏ దశలోనూ పోటీలో కానరాలేదు. పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు గతంలో పోటీ చేసిన అనుభవమే కాకుండా క్షేత్రస్థాయిలో పరిచయాలు, వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, బీసీ సంఘాల మద్దతు కలసి వచ్చే అంశంగా మారింది. పోతుల నాగరాజు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రేసులో ముందున్నట్లు తెలుస్తోంది. ఈనెల 16న ఓట్ల లెక్కింపు ఉంటుంది. దీంతో ఎక్కడ నలుగురు గుమికూడినా ఎమ్మెల్సీ ఎన్నికల సరళిపై లెక్కలు వేస్తున్నారు.

ప్రభుత్వం హామీనిచ్చే వరకు పోరు ఆగదు

బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం నుంచి ఉద్యోగ, ఉపాధ్య, కార్మిక, రిటైర్డు, ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సాగే పోరాటంలో కలిసి రావడం ద్వారా ఐక్యతను చాటాలని ఉద్యోగులు, కార్మికులకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజువెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు పోరు ఆగబోదని తేల్చిచెప్పారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసనలు తెలిపారు. వైద్యారోగ్యశాఖ సంచాలకులు, ప్రణాళిక విభాగం, దేవాదాయశాఖ తదితర ముఖ్యకార్యాలయాల్లో ప్రతి ఉద్యోగిని నేతలు కలిసి వారు ఇబ్బందులు, సమస్యలపై ఆరా తీశారు. పీఆర్సీ బకాయిలపైన, కొత్త, పాత డీఏ బకాయిలు, కొత్త డీఏ చెల్లింపులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర ప్రయోజనాలు రాకుండా ఉద్యోగుల ఇబ్బందుల్ని అడిగి తెలుసుకున్నారు. బొప్పరాజు మాట్లా డుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుపై ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని, చివరకు వేతనాలు, పెన్షన్లు ఒకటో తేదీ వేయకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ ఉద్యమానికి యూనియన్లు/ అసోషియేషన్లకు అతీతంగా అందరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావుతో పాటు అమరావతి రాష్ట్ర కోశాధికారి వీవీ మురళీకృష్ణంనాయుడు, కో-చైర్మన్ ఎస్.మల్లేశ్వరరావు, సంఘం రాష్ట్ర నాయకులు సాంబశివరావు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు తిరుగుబాటు ఎమ్మెల్యేలు

తన సీటులోనే కోటంరెడ్డి: సీటు మారిన ఆనం రామనారాయణ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై తిరుగు బాటు ప్రకటించిన నెల్లూరు రూరల్, వెంకటగిరి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రామ నారాయణ రెడ్డి మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యారు. వైసీపీపై తిరుగుబాటు నేపథ్యంలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరవరని అందరూ భావించి నప్పటికీ, అందరి అంచనాలు తలకిందులు చేస్తూ సమావేశాలకు హాజరయ్యారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోమవా రమే నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి తాను సమావేశాలకు హాజరవుతున్నట్లు ప్రకటిం చారు. అంతేకాకుండా, నియోజకవర్గ సమస్యలపై సభలో గళమెత్తుతానని స్పష్టం చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి మాత్రం ముందుగా ప్రకటించకుండా మంగళవారం సభకు హాజరయ్యారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాత్రం ఎప్పటిలాగే తాను కూర్చునే సీటులోనే కూర్చున్నారు. శ్రీధర్ రెడ్డి కూర్చునే సీటు టీడీపీ సభ్యులకు సీట్లకు దగ్గరగా ఉంటుంది. ఆనం రామనారాయణ రెడ్డి మాత్రం ఇది వరకు తాను కూర్చునే కుర్చీ కాకుండా టీడీపీ సభ్యులకు దగ్గరగా ఉండే మరో సీట్లో కూర్చున్నారు. సభలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం వస్తుందా రాదా అనేది వేచి చూడాలి. ఒకవేళ మాట్లాడే అవకాశం వస్తే ఏం మాట్లాడతారు, దానికి వైసీపీ ఎమ్మెల్యేల ప్రతి స్పందన ఎలా ఉంటుంది అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరు తిరుగుబాటు ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఏమైనా వ్యాఖ్యలు చేస్తారా అనేది కూడా వేచి చూడాల్సి ఉంది.

అభివృద్ధి, ఉపాధి ఊసేలేదు

గవర్నర్ ప్రసంగంపై సీపీఎం విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రారంభోపన్యాసంలో రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం గురించి ఏమీ లేదని, 'నవరత్నాల' లెక్కలతోనే మభ్యపెట్టేలా సాగిందని సీపీఎం ఏపీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కొత్త పథకాలు, యువత భవిష్యత్తుకు భరోసానిచ్చే అంశాలే కరువయ్యాయని మంగళవారం ఓ ప్రకటనలో వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయం, రావాల్సిన నిధులపై, ప్రత్యేక హోదా, విభజన హామీల ప్రస్తావనే ప్రసంగంలో రాలేదన్నారు. కేంద్రం చేసిన విద్రోహాన్ని ప్రస్తావించకపోవడం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడమేనని విమర్శించారు. రాబోయే రోజుల్లో చేయబోయే ప్రణాళికల్ని భూతద్దంలో పెట్టి చూపించారని, నవరత్నాల పేరిట అమలవుతున్న సంక్షేమ పథకాలు, నగదు బదిలీ పథకాల లెక్కలతోనే ప్రసంగం మొత్తం సాగిందన్నారు. ఇది నిరాశపర్చిందని అన్నారు. కార్మికుల కనీస వేతనాలు పెంచలేదని, ఒప్పంద కార్మికుల క్రమబద్ధీకరణను ప్రభుత్వం పట్టించుకోలేదని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు, సీపీఎస్ రద్దు ప్రస్తావనే రాలేదని పేర్కొన్నారు. మంత్రి పదవులతో సామాజిక న్యాయం రాదని, దిశ యాప్‌తో మహిళలకు రక్షణ లభించదని, భాషా వలంటీర్ల తొలగింపు, ఎస్సీ, ఎస్టీ పథకాల పునరుద్ధరణపై గవర్నర్ మాట్లాడలేదని శ్రీనివాసరావు విమర్శించారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలి

గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ సంపద, పోర్టులు, ఉక్కు కార్మాగారం, విమానాశ్రయాలు, విద్యుత్ ప్రాజెక్టులను అంబానీ, ఆదానీలకు బీజేపీ ధారాదత్తం చేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి నీరుగారుతోందని విమర్శించారు. అవినీతి, అక్రమాలు, కక్ష సాధింపు చర్యలకు సీఎం బాధ్యత వహించాలన్నారు. ప్రజా సంక్షేమానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదాపై కేంద్రాన్ని నిలదీయడంలో సీఎం జగన్ విఫలమయ్యారన్నారు. ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిసిన జగన్ ఎన్నిసార్లు రాష్ట్రం గురించి మాట్లాడారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, నాయకులు కొలనుకొండ శివాజీ, చేవూరు శ్రీధర్‌రెడ్డి, మేడా సురేశ్ పాల్గొన్నారు.

18న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 10.30గంటలకు విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరిభవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరుగుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా బీకేఎంయూ జాతీయ అధ్యక్షులు ఎస్.పెరియాస్వామి హాజరవుతారన్నారు. సమావేశంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభల నిర్వహణతో పాటు జగనన్న కాలనీలలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో పక్కా ఇళ్ల నిర్మాణం, టిడ్కో ఇళ్లు, భూ సమస్యలపై ప్రధానంగా చర్చిస్తారని తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యులు, ఆహ్వానితులు సకాలంలో తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సంపాదకీయం

పార్లమెంటుకు అడ్డుతగులుతున్న అధికార పక్షం

ప్రతిపక్ష సభ్యులు అధికార పక్షానికి సహించని ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, వాయిదా తీర్మానాలకోసం పట్టుబట్టినప్పుడు, ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీయడానికి ప్రయత్నించినప్పుడు పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగేది. మోదీ హయాంలో ఈ పరిస్థితి తిరగబడింది. అధికార పక్ష సభ్యులు రగడ లేవదీయడంవల్లే పార్లమెంటు కార్యకలాపాలకు భంగం కలుగుతోంది. బీజేపీకి ఉన్న సంఖ్యాబలం కారణంగా ప్రతిపక్షాల గొంతు వినిపించకుండా పోతోంది. ప్రతిపక్ష నాయకులు తమకు నచ్చని వ్యాఖ్యలు చేస్తే వాటిని టోకున రికార్డుల నుంచి తొలగిస్తున్నారు. పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమైన మాటలు ఎవరైనా వాడితే వాటిని రికార్డుల నుంచి తొలగించమని స్పీకర్ ఆదేశించేవారు. మోదీ హయాంలో పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమైన మాటలనే కాదు ప్రభుత్వ పక్షానికి మింగుడు పడని వాక్యాలు, పేరాలు రికార్డులలో లేకుండా పోతున్నాయి. అసలు పార్లమెంటు సమావేశాలు జరిగే సమయమే క్రమంగా కుంచించుకుపోతోంది. ప్రధానమంత్రి పార్లమెంటు సమావేశాల్లో కనిపించడమే మహద్భాగ్యమై పోయింది. సోమవారం ప్రారంభమైన రెండవ విడత బడ్జెట్ సమావేశాలు మొదటి రోజు నుంచే గలభా వల్ల వాయిదా పడుతూ వస్తున్నాయి. రెండో రోజూ అదే తీరు. పార్లమెంటులో రగడ కొనసాగడానికి అనువైన వాతావరణం ఏర్పడడానికి సాక్షాత్తు ప్రధానమంత్రే కారణం. ఆయన ఆదివారం కర్నాటకలోని హుబ్లీ, ధార్వాడ్ సభల్లో మాట్లాడుతూ రాహుల్ గాంధీ లండన్ లో కూర్చుని భారత్ లో ప్రజాస్వామ్యం అడుగంటుతోందని చెప్పడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. అలాంటి వారిని సమర్థించకూడదన్నారు. ఇంకేముంది సోమవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాగానే బీజేపీ తరఫు మైలార భటుల్లాంటి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, అనురాగ్ ఠాకూర్, పీయూష్ గోయల్, రాజ్‌నాథ్ సింగ్. గిరిరాజ్ సింగ్, ప్రహ్లాద్‌జోషి లాంటి వారు ఉభయ సభల్లో రాహుల్‌గాంధీ పైన విరుచుకుపడ్డారు. సాధారణంగా మర్యాద తప్పని రాజ్‌నాథ్ సింగ్ కూడా తిట్ల దండకం ఎత్తుకున్నారు. సాక్షాత్తు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సభను సజావుగా నిర్వహించడానికి కృషి చేయవలసిన బాధ్యతను గాలికి వదిలేసి రాహుల్ గాంధీ మీద ఒంటి కాలి మీద లేచారు. ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, అనురాగ్ శర్మ, గిరిరాజ్ సింగ్ మర్యాద తప్పి ప్రవర్తించడాన్ని అర్థం చేసుకోవచ్చు. వారికి తమ నోటి మీద అదుపు ఉన్న సందర్భాలు చాలా స్వల్పం. కానీ సీనియర్ మంత్రులు రాజ్ నాథ్ సింగ్, పీయూష్ గోయల్ కూడా పూనకం వచ్చినట్టు ప్రవర్తించడం విచిత్రంగా ఉంది. పార్లమెంటరీ సంప్రదాయాలపై వారికున్న ఆదరణ ఎంత లేశమాత్రమో రుజువు అయింది. లండన్ లో రాహుల్ గాంధీ మన దేశంలో ప్రజాస్వామ్యానికి భంగం కలుగుతోందని, ఇతర ప్రజాస్వామ్య దేశాలు ఈ అంశాన్ని గమనించాలని, లేకపోతే ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యానికే ముప్పు వస్తుందని అనడం బీజేపీ నాయకులు సహించలేకపోతున్నారు. వాస్తవాన్ని అంగీకరించడం మోదీకి, ఆయన అనుయాయులకు ఎన్నడూ అలవాటు లేదు. అయినా ఇంత బరితెగించడం బహుశా ఇదే మొదటిసారి కావొచ్చు. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరుగుతున్నాయన్న సందర్భాలలోనూ ప్రతిపక్ష నాయకుల మాటలు అధికార పక్షానికి రుచించకపోతే ప్రతిపక్ష నాయకుల మైకులు మూగ వోతాయి. విధానాల రూపకల్పనకు, ప్రజా సమస్యలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చలకు, సంవాదాలకు పార్లమెంటు వేదిక కాకుండా పోయింది. అంతా ఏకపక్షంగానే జరగాలన్న అధికార పక్షం మంకు పట్టు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ ఉన్న పక్షం మాట నెగ్గడమేనన్న సంకుచిత భావం అధికారపక్షంలో గూడుకట్టుకు పోయింది. ప్రతిపక్షం మాట కూడా వినడం ప్రజాస్వామ్య మౌలిక లక్షణం అన్న ధ్యాస బీజేపీ నాయకులకు ఏ కోశానా లేదు. లోకసభ స్పీకర్, రాజ్యసభ అధ్యక్షుడు ముందు ఏదో ఒక పార్టీకి చెందిన వారై అయి ఉండొచ్చు. కానీ ఒక్క సారి వారు సభాధ్యక్ష స్థానంలోకి వచ్చిన తరవాత సంపూర్ణంగా నిష్పక్షపాతంగా వ్యవహరించడం సంప్రదాయం. కానీ మోదీ హయాంలో అమలులోకి తెస్తున్న దుష్ట సంప్రదాయాలే సంప్రదాయాలుగా చెలామణి అవుతున్న కాని కాలంలో బతుకుతున్నాం.

ప్రతిపక్ష నాయకులకు పార్లమెంటు వేదిక మీద మాట్లాడే అవకాశం రాను రాను తగ్గిపోతున్నందువల్ల పార్లమెంటు ఆవరణలోనే, పార్లమెంటు భవనం వెలుపల పత్రికా విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకోవడం తప్ప మర్గాంతరం లేదు. పార్లమెంటు రాజకీయ కక్ష తీర్చుకునే రచ్చబండగా, చాకిరేవుగా రూపాంతరం చెందినప్పుడు మరో మార్గం ఉంటుందను కోవడంకూడా భ్రమే. లండన్‌లో రాహుల్‌గాంధీ అన్న మాటలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు యాగీ చేస్తున్నారు. దీనికి ప్రతిగా ప్రధాని క్షమాపణ కోరాలన్న వాదనరావడంలో అసహజం ఏమీలేదు. దేశ ప్రజాస్వామ్య దుస్థితిగురించి రాహుల్ విదేశీగడ్డ మీద ప్రస్తావించడాన్ని బీజేపీ తప్పుపడ్తోంది. ఇదెక్కడిన్యాయమో ఎంత తరచిచూసినా అంతు పట్టదు. ఇతరదేశాలలో జరుగుతున్న అకృత్యాలను మనదేశంలోనే విమర్శించడం కాకుండా అంతర్జాతీయ వేదికలమీద మన నాయకులు ప్రస్తావించిన ఉదంతాలు బీజేపీకి ఎందుకు కనిపించవో అంతుపట్టదు. పలస్తీనా స్వయంప్రతిపత్తి గురించి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా మనం దశాబ్దాల తరబడిపోరాడాం. ఈ పోరాటాలు నాలుగుగోడల మధ్య జరిగిన వేంకావు. అంతర్జాతీయ వేదికల మీదే ప్రస్తావించాం. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష కొనసాగినప్పుడు నెల్సన్ మండేలా పోరాటాన్ని సమర్థించాం. విదేశీ గడ్డ మీద మన వ్యవహారాలు లేవనెత్తకూడదంటే మరి ఇతర దేశాల వ్యవహారాలు ప్రస్తావించే హక్కు మనకెక్కడిది అన్న ప్రశ్న బీజేపీ నేతల మెదళ్లకు తోచనేతోచదు. ఇలాంటి వ్యవహారాలు ముఖ్యంగా అంత ర్జాతీయంగా ప్రజాస్వామ్య విధానాలకు అండగా నిల బడడం, జాతి వివక్షను ఎండగట్టడం, సంపన్న, పేద దేశాల మధ్య అంతరాలు తగ్గాలని వాదించడం దశాబ్దాలుగా మన విదేశాంగ విధానానికి గీటురాళ్లుగా ఉన్నాయి. కానీ పలస్తీనా వ్యవహారంలో సాంప్రదాయికంగా మనం అనుసరిస్తున్న విధానాలను మంటగలిపి ఇజ్రాయిల్ తో స్నేహం కోసం తహ తహ లాడడం బీజేపీ హయాం ప్రారంభమైన తరవాతే చూస్తున్నాం.

స్వయంగా మోదీ అనేక దేశాలలో పర్యటించి నప్పుడు మునుపటి ప్రభుత్వ విధానాలను విమర్శించడంతో సరిపెట్టి కోకుండా తాను అధికారంలోకి రాకముందు భారతీయులుగా ఎందుకు పుట్టాం అని సిగ్గుపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించడానికి రాహుల్ కు వర్తించే సూత్రం వర్తించకపోవడానికి బీజేపీ ఆధిపత్య ధోరణే కారణంగదా. మన దేశంలో ప్రజాస్వామ్య సంప్రదాయాలు అడుగంటుతున్నాయని రాహుల్ అంటే విదేశాలను జోక్యం చేసుకొమ్మని ఆయన కోరారని వక్రీకరణలకు దిగడం బీజేపీ ప్రత్యేకత కాబోలు. ఈ వ్యాఖ్యలు చేసినందుకు రాహుల్ గాంధీని దేశద్రోహి అని నిందిస్తున్నారు. ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అయితే రాహుల్‌ను దేశం నుంచే పంపించి వేయాలంటున్నారు. విదేశీ వనితకు పుట్టిన వ్యక్తికి దేశభక్తి ఎక్కడినుంచి వస్తుంది అని నీచస్థాయి మాటలు మాట్లాడుతున్నారు. విదేశీయులు అంత అంటరాని వారైనప్పుడు మోదీ మన దేశ కీర్తిబావుటాను ఎగరేస్తున్నారని ఎలా అనగలుగుతున్నారు. విదేశీయమైన ప్రతిదీ పరిత్యజించదగిందే కావాలిగదా! అసత్యమాడడంలో మోదీ అనుయాయులు ఆయనను మించిపోయేట్టు ఉన్నారు. పార్లమెంటరీ సంప్రదాయాలమీద ప్రస్తుత బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదు. పార్లమెంటు జరగకుండా చేయడం అధికార పార్టీకి విశేషాధికారం అయిపోయినట్టుంది.

శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

నేటి మానవ ప్రపంచంలో చోటు చేసుకుంటున్న విపరీత పోకడలను పరిత్యజించాలి. శాస్త్రబద్ధమైన ఆలోచనలకు విలువివ్వాలి. విజ్ఞానం ఒక అనంతమైన సాగరం. విజ్ఞాన సాగరాన్ని మధించి విలువైన జ్ఞానసంపదను వెలికితీసి, జనహితంకోసం వినియోగించడం లోనే మానవ విజ్ఞతకు పరిపక్వత చేకూరుతుంది. విజ్ఞానం మానవ వినాశనానికిదారితీయడం అత్యంతదారుణం. అణ్వాయుధ ప్రయోగాల వలన హీరోషిమా, నాగసాకి వంటి నగరాలు విధ్వంసమైపోయాయి. హీరోషిమా, నాగసాకి నగరాల్లో జరిగిన అపారనష్టం మన స్మృతి పథం నుండి ఈనాటికీ చెరిగిపోలేదు. ఈనాటికీ ఈ అణు ప్రభావం వలన అక్కడి ప్రజలు దుష్పరిణామాలు ఎదుర్కొంటూనే ఉన్నారు. మొదటి,రె రెండవ ప్రపంచ యుద్ధాలు సృష్టించినవిలయాన్ని చరిత్ర మరచిపోలేదు. అయినా ఇంకా ప్రపంచంలో ఆధిపత్యంకోసం అనాగరిక మారణహోమం కొనసాగడం విజ్ఞానమా?అజ్ఞానమా? ఇరు దేశాలకు పరిమితం కావలసిన ఒక చిన్న సమస్య అమెరికా అరంగేట్రం వలన భీకర యుద్ధానికి దారితీసింది. రష్యా, ఉక్రెయిన్ల మధ్య ఏడాదిగా కొనసాగు తున్న యుద్ధంలో లక్షలాది మంది ప్రజలు, సైనికులు చనిపోయారు. ఉక్రెయిన్ సర్వనాశనమై పోయింది. రష్యా ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయింది. యుద్ధాల వలన ఏ దేశానికి లబ్ది చేకూరదు. యుద్ధాల్లో ఎవరు గెలిచినా, ఓడినా ఉభయపక్షాలను పరాజితులుగానే భావించాలి. యుద్ధాల్లో అంతిమ బాధితులు ప్రజలే నన్న సత్యం మరవరాదు. ఇలాంటి ఆధిపత్య ధోరణులకు స్వస్తి చెప్పాలి. విజ్ఞానంవలన సమకూరిన ఆయుధాలు మారణహోమానికి వినియోగించడం అవాంఛనీయం. విజ్ఞానం మానవాళి జీవితాలను సుఖమయం చేయాలి. ప్రజల అవసరాలకు బాసటగా నిలవాలి. ఆకలి, దరిద్రం, అవిద్య వంటి సమస్యల నుండి గట్టెక్కించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలి. భూగోళ, ఖగోళ అధ్యయనాలు, శాస్త్రీయ పరిశోధనా ఫలితాల వలన ఏర్పడిన నూతన ఆవిష్కరణలు విశ్వ సమాజ ప్రగతికి దోహదంచేయాలి. నాగరికతపెరిగిన నేపథ్యంలో ప్రపంచం అరచేతిలో ఇమిడి పోయినట్టుగా రూపాంతరం చెందిన వర్తమానంలో సైన్స్ వినియోగం వివేకంతో సాగాలి. సైన్స్ లేనిదే పూట గడవని ప్రస్తుత పరిస్థితులను, గతకాలం నాటి పరిస్థితులను రేఖా మాత్రంగానైనా ఒకసారి స్పృశించి, విశ్లేషిద్దాం.

అడవుల్లో ఆకులు, అలాలు తింటూ, మనిషికీ, జంతువుకీ మధ్య వ్యత్యాసం లేని రాతియుగం నుండి, ఆదిమానవ ప్రస్థానం నుండి ఆధునిక మానవ పరివర్తనం వరకు అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. నేడు మనం అనుభవిస్తున్న సైన్స్ ఫలాల వెనుక ఎంతటి చరిత్ర ఉందో గమనించాలి. నాటి మూఢవిశ్వాసాల నుండి మతాధికారుల దుర్మార్గాల నుండి ప్రజలను కాపాడడానికి ఎంతో మంది శాస్త్రవేత్తలు అహరహం శ్రమించారు. తమ జీవితాలను పణంగా పెట్టి ప్రజలజీవితాల్లో విజ్ఞానకాంతులను విరబూ యించారు. సైన్స్‌కు మత మౌఢ్యానికి మధ్య జరిగిన సంఘర్షణలో ఎంతో మంది శాస్త్రవేత్తలు ఎన్నో శిక్షలకు గురైనారు. ఎంతో మంది నిర్దాక్షిణ్యంగా హతులైనారు. నిజం చెబితే దైవద్రోహంగా పరి గణించడం, పరిశోధనలు చేస్తే కఠిన శిక్షలు అమలు చేయడం వంటి అత్యంత దారుణమైన పరిస్థితులున్న నాటి కాలంలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసి, శాస్త్రీయ ఫలితాలతో రాబోయే తరాలకోసం శ్రమించి, దారుణంగా బలైపోయిన అలనాటి శాస్త్రవేత్తల చరిత్రను పరిశీలించి, శాస్త్రీయకోణంలో ఆలోచించడం ద్వారా ఈ ఆధునికంలో విస్తరిస్తున్న అంధ విశ్వాసాలకు, మూఢత్వ భావాలకు, మూర్ఖ సిద్ధాంతాలకు స్వస్తి చెప్పవచ్చు.

అరిస్టాటిల్‌ను విజ్ఞానానికే పర్యాయ పదంగా అప్పట్లో పేర్కొనేవారు. అరిస్టాటిల్ గ్రంథాలను విమర్శించడం మతద్రోహంగా భావించి శిక్షించేవారు. గురుశిష్యులైన గ్రీకు తత్వ వేత్తలు ప్లేటో, అరిస్టాటిల్‌లు విశ్వానికి భూమి కేంద్రమనే ప్రతిపాదనలను బలపరిచారు. విశ్వం అనంతమైనదని, ఇతర గ్రహాల్లో కూడా జీవం ఉండే అవకాశాలున్నాయని, సూర్యుడు విశ్వానికి కేంద్రమని ఆధునిక విజ్ఞానానికి పునాదులు వేసిన "బ్రూనో" మత పెద్దల కోపాగ్నికి గురయ్యాడు. తర్కానికి, హేతువాదానికి, శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యత నిచ్చే కోణంలో ఆలోచించాలని పేర్కొంటూ, సత్యం కోసం పోరాడిన బ్రూనో ఒక గొప్ప తత్వ,గణిత శాస్త్రవేత్త. ఆయన సత్య శోధనకు అప్పటి మత మౌఢ్యం అనేక సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. అయినా సత్య పథాన్ని విడనాడక పోరాడిన బ్రూనోను కర్కశంగా సజీవ దహనం చేసారు. బ్రూనో సజీవ దహన మైనా అతని ఆలోచనలు సజీవంగానే ఉన్నాయి.

గ్రీకు తత్వవేత్త, విజ్ఞానగని సోక్రటీస్‌ను కూడా నిజాలను నిర్భయంగా చెప్పినందుకు విషమిచ్చి చంపారు. ఇలా ఒకరు కాదు...ఎందరో... మరెందరో నాటి మతపెద్దల మూఢనమ్మకాలకు బలైపోయి, ప్రపంచానికి తమ త్యాగాల ద్వారా సైన్స్‌వెలుగులను ప్రసాదించారు. ప్రస్తుత ప్రపంచంలో ఇంకా పనికిరాని మూఢవిశ్వాసాలు జన జీవితాలను శాసిస్తున్నాయి. ఇకనైనా శాస్త్రీయతలేని సమాజానికి హాని కలిగించే మూఢ నమ్మకాలను విడిచిపెట్టాలి. మత సంబంధమైన విశ్వాసాలను వ్యక్తిగత మైనవిగా భావించాలి. ఆధ్యాత్మికత విలువలు పెంపొందించడానికి, మంచిని ప్రోది చేయడానికి వినియోగపడాలి. మానవ ఎదుగుదలను ఆపే అంధవిశ్వాసాలను ప్రోత్సహించడం ఆధునిక విజ్ఞానానికి తలవంపులు తెచ్చే అవాంఛనీయమైన పోకడలుగా గుర్తించాలి. మతాల్లోని మంచిని, విలువలను స్వీకరించాలి. ఇదే సందర్భంలో మూఢ భావాలకు చరమ గీతం పాడాలి. శాస్త్రీయ పరిశోధనా ఫలితాలను అనుభవిస్తూ, సైన్సును తప్పుబట్టడం అవివేకం,అజ్ఞానం.

సుంకవల్లి సత్తిరాజు. మొ: 9704903463.

సమాజంపై సీరియళ్ల దుష్ప్రభావం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

మాధ్యమాల్లో విలువల పతనానికి లాభాపేక్ష గల బాధ్యతారహిత పెట్టుబడిదారీ పత్రికా వ్యవస్థ కారణం. పఠన, శ్రవణ మాధ్యమాల కంటే దృశ్య మాధ్యమాల ప్రభావం తీవ్రమైంది. సీరియళ్ళు చూసేది ఎక్కువ స్త్రీలే. ఇవివారి మెదళ్లను పాడుచేసి, సమాజాన్ని సర్వనాశనం చేస్తున్నాయి. సీరియళ్ళ కథనాలు, స్త్రీ పాత్రల చిత్రీకరణ అసహజంగా, మానవత్వ విచ్ఛిన్నంగా ఉంటున్నాయి. సమాజంలోని నైతిక విలువల ప్రభావం సీరియళ్ళలో, సీరియళ్ళ ప్రభావం సమాజంలో పరస్పరం ప్రతిఫలిస్తున్నాయి.

టివి సీరియళ్ళన్నీ కల్పనలే. వాటి లక్ష్యం వినోదమే. ఈ వినోదపు తీరుతెన్నులు, సామాజిక ప్రయోజకత్వం, ప్రత్యేకించి స్త్రీలపై వీటి ప్రభావం రచయిత అవగాహనపై ఆధారపడి ఉంటాయి. శాస్త్రీయ దృక్పథం, సామాజిక స్పృహ బాధ్యతలు లేని రచయితలు సమాజ వినాశక రచనలు చేస్తారు. నిర్మాతలు వాటిని చిత్రీకరిస్తారు. దర్శకులు సహకరిస్తారు. పౌరాణిక కవులు ఒక పాత్రలో ఒక గుణాన్ని ఎత్తిచూపడానికి ఆ పాత్ర మానవత్వాన్నే హత్య చేశారు. పరశురాముని పితృభక్తిలో ఆయన మాతృప్రేమను, మానవత్వాన్ని మంటకలిపారు. సీరియళ్ళ పాత్రల చిత్రీకరణలోనూ ఇదే జరుగుతోంది. 15 ఏళ్ల క్రితం ఒక మహిళా అధ్యయన సంస్థ నివేదిక ఇలా ఉంది. "ఉదయం 11 నుండి రాత్రి 11దాకా కొందరుస్త్రీలు క్రమంతప్పక సీరియళ్ళు చూస్తారు. వారి ప్రవర్తనలో ఊహించని మార్పొస్తుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగువారు, స్నేహితులతో సంబంధాల్లో గణనీయమైన మార్పు వస్తుంది. తోటి స్త్రీలపై నమ్మకంపోతుంది. వారితో మనసు విప్పి మాట్లాడే అలవాటు, స్నేహభావం మాయమౌతాయి. సీరియళ్ళలోని ఆడంబరతలతో తమ స్థితిగతులను పోల్చుకొని న్యూనతాభావం చోటుచేసుకుంటుంది.మానసిక రోగులుగా మారతారు. సీరియళ్ళతో ప్రయోజనంలేదని, అన్నీ నష్టాలేనని వీక్షకులు గమనించాలి."40-60 ఏళ్లవారు సీరియళ్ళ పాత్రల్లో దూరు తున్నారు. ప్రమాదకర మానసిక స్థితికి చేరుతున్నారు. సీరియళ్ళలో స్త్రీని స్త్రీకి శత్రువుగా చూపిస్తున్నారు. అత్తాకోడళ్ళు, తోడుకోడళ్లు, అక్కాచెల్లెళ్లు, ఆడ పడుచులు, అమ్మాకూతుర్లు కొట్లాడుకుంటారు. కుట్రలు పన్నుతారు. పరపతి, ఆస్తి, అధికారం, ఉద్యోగం ఉన్న మగాడిని, పెళ్ళైనవాడైనా సరే, వలలో వేసుకోడానికి చేయరాని పనులు చేస్తారు. మగాడికి ఇద్దరు పెళ్ళాలుంటారు. ఆ మగాడి అమ్మ, లేదా అమ్మాయి అమ్మ వంతపాడతారు. ఆ మగాడి

భార్యను వదిలేసి మరొక స్త్రీతో తిరిగిన వైద్యవరుడు.
చెల్లిని ప్రేమించి అక్కను పెళ్లాడి చెల్లిని గర్భవతిని చేసిన భర్తను దేవునిగా చూసిన అక్క దేవత.

తప్పేమిలేనట్లు, భార్యలతో భర్త తెగ బాధపడిపోతున్నట్లు, తీవ్ర కష్టనష్టాలు భరిస్తున్నట్లు చూపిస్తారు. గయ్యాళ్ళు కాని స్త్రీలంతా ఏడుస్తూనే ఉంటారు. ఎంత పేరు ప్రఖ్యాతులున్నా అవివాహిత స్త్రీలను ఉన్నతంగా, ఆదర్శంగా చూపరు. నీచులుగా, మగాళ్లను మోసగించేవాళ్లుగా చిత్రిస్తారు. ఇవన్నీ వాస్తవ విరుద్ధాలు. నిజజీవితానికి దూరమైనవి. సీరియళ్ళ స్త్రీలకు సౌందర్య పిచ్చి ఎక్కువన్నట్లు చూపుతారు. 24 గంటలూ అలంకరించుకునే ఉంటారు. కట్టుబొట్టు, అలంకరణ, ఆహార్యం వికారంగా, వెటకారంగా ఉంటాయి. అలాంటి ఆభరణాలు, అలంకారాలు లేని బతుకు సాధారణ స్త్రీలకు దండగని పిస్తుంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు కూడా అసభ్య వస్త్రధారణతో,జుగుప్సాకర అలంకారాలతో ఉంటారు. స్త్రీలు అందంగా ఉండాలన్న భావన కల్పిస్తారు. వారి శరీర సౌందర్యానికే కాని, వృత్తి, శక్తి సామర్థ్యాలు, వ్యక్తిత్వాలకు విలువనివ్వరు. చదువుకున్న పట్టణప్రాంత కోడలు గ్రామీణప్రాంత తోడుకోడలును రాచిరంపాన పెడుతుంది. సీరియళ్ళలో శారీరక శ్రమకు విలువ ఉండదు. శ్రమసంస్కృతిని నాశనంచేశారు. కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నంచేశారు. చదువుకున్న స్త్రీలను సంస్కారహీనులుగా, దుర్మార్గురాళ్ళుగా చూపిస్తారు. జాతీయ భాష హిందీతో సహా ప్రాంతీయ భాషల సీరియళ్ళన్నీ ఒకేలా ఉంటాయి. హిందీ సీరియళ్ళ మహిళా నిర్మాత ఏకతాకపూర్, స్త్రీ పాత్రలను హీనంగా చిత్రీకరించారు. ఈ వరవడి ఇతర సీరియళ్ళకు పాకింది. మగాళ్లు మద్యపాన, వ్యభిచార ప్రియులు. స్త్రీలు వాళ్ళను సహిస్తారు. భరిస్తారు. యువ పాత్రలు గడ్డాలతో ఉంటాయి. వీటిని చూస్తేనేమో నేటి యువకులు పెళ్ళిలో కూడా గడ్డం తీయరు. పెళ్ళికూతుర్లు భరిస్తారు. కథకు అవసరమైతే తప్పితే సీరియళ్ళలో కామన్ మ్యాన్ కనపడడు. అంతా ధనవంతులే. ఇళ్ళు రాజభవనాలే. మానవ సంబంధాలను అమాన వీకరిస్తారు. అడుగడుగునా లింగవివక్ష కన్పిస్తుంది. మోసాలు, హత్యలు, శృంగారం, క్షుద్రపూజలు ప్రదర్శిస్తారు. పూజలు, ఆచారాలు, యజ్ఞ యాగాలు, క్రతువులు, పుట్టినరోజులు, నామకరణాలు, అక్షరాభ్యాసాలు, కర్మకాండలు ఆడంబరంగా చేయిస్తారు. ఆడంబరాలు, గుడ్డి నమ్మకాలను పెంచుతున్నారు.

విరామ సమాజం హానికరం. సీరియళ్ళు విరామ సమాజపు ఫలితాలు. సమాజంలో సగమైన స్త్రీలు సీరియళ్ళ మత్తులో మునిగితే సామాజిక ప్రగతికుంటుపడి సమాజంవెనకకు నడుస్తుంది. సీరియళ్ళలో డైలాగులు నిదానంగా పట్టి పట్టి పలుకుతారు. సాధారణంగా ఒకరు మాట్లాడేటప్పుడు మరొకరు మాట్లాడరు. ఈ లక్షణాలు మంచివే. ఐతే కెమెరా ఒకరిని మార్చి ఒకరిపై నిలిపి వెలుతురు పెంచి, చుక్ చుక్ అన్న విచిత్ర శబ్దాలతో ప్రసారం చేస్తారు. ఇవి వీక్షకుల కళ్ళకు హానికరం. అరగంటసీరియల్‌లో ఐదు నిమిషాలకథ కూడా నడవదు. కాలమంతా ప్రకటనలతో, జరిగిన కథతో, జరగబోయే కథతో గడిచి పోతుంది. సీరియల్ ఏళ్ల తరబడి సాగుతుంది. వీక్షకుల కాలం వృథా అవుతుంది. వారుఏమౌతుందోనన్న వత్తిళ్లకు లోనవుతూనేఉంటారు. సీరియళ్ళ నిర్మాతలు విపరీత లాభార్జన పొందుతారు. మంచి సీరియళ్ళు ఉండవు కాని కొన్నింటిలో మంచి అంశాలు ఉంటాయి. ఒక సీరియల్‌లో కొడుకు వదిలేసిన కోడలుతో అత్త చాలా ప్రేమగా వ్యవహరిస్తారు. వీటిని ప్రచారం చేయాలి.

మగాళ్లు క్లబ్బులు, పబ్బులు, బార్లు, సినిమాలు, షికార్లలో మునిగిపోతే సరిపోదు. జీవిత భాగస్వాములను పట్టించుకోవాలి. స్త్రీలకు వ్యాపకం, ప్రత్యామ్నాయ పనులు కల్పించాలి. సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. స్త్రీలు పాల్గొంటేనే ఏ పనైనా విజయవంతమౌతుంది. నల్ల సాగు చట్టాల వ్యతిరేక రైతు ఉద్యమంలో స్త్రీల పాత్ర తాజా ఉదాహరణ. సీరియళ్ళ నియంత్రణ ప్రజల చేతుల్లోనే ఉంది. వీటిని చూడకపోవడమే పరిష్కారం. స్త్రీవ్యతిరేక సీరియళ్ళను తీసేవారి కంటే చూసేవారే అపాయకారులు. ప్రజల్లో సామాజిక స్పృహ, చైతన్యం పెంచటానికి పౌరసంఘాలు కృషిచేయాలి. వీక్షకులు తమను తాము సంస్కరించుకోవాలి. మంచీచెడుల అవగాహనకు రావాలి. చెడు సీరియళ్ళను చూడొద్దని ప్రచారంచేయాలి. దీనితో క్రమేపీ మంచి సీరియళ్ళు నిర్మిస్తారు. సీరియళ్ళను స్త్రీలు వినోదాత్మకంగాకాక విమర్శనాత్మకంగా చూడాలి. స్త్రీ వ్యతిరేక సీరియళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఇందుకు మహిళా సమాఖ్యలు చొరవ తీసుకోవాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి: 9490204545

భారమైన రవాణా కార్మికుల బతుకుబండి

రహదారి రవాణా రంగం దేశ ప్రగతికి అత్యంత ముఖ్యమైనది, రవాణా మౌలిక సదుపాయాలు దేశం పురోగతికి వేగం సామర్థ్యాన్ని పెంచుతుంది. వస్తువుల రవాణా, పంపిణీ చేయడంలో నగరాల్లో నడుస్తున్న స్థానిక రవాణా కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న రంగం రవాణా రంగం. అంతటి ప్రాధాన్యత కలిగిన రవాణా రంగానికి ప్రభుత్వాలు చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవస్థలో రవాణా రంగం అతి కీలకమని గుర్తించి ప్రభుత్వాలు తోడ్పాటు నిచ్చినట్లయితే ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. రవాణారంగంలోకి రోజురోజుకీ కొత్త సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశించడంతోపాటు అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందువల్ల ఆ మార్పులకు అనుగుణంగా సిబ్బందిని సిద్ధం చేయడం కష్టమవుతోంది. గత రెండు సంవత్సరాలుగా డీజిల్, పెట్రోల్ ధరలు డెబ్బై శాతం పెరగడంతో రవాణారంగానికి గడ్డుకాలం ఏర్పడింది. మరోవైపు రవాణ, పోలీసు అధికారులు వేస్తున్న ఫైన్లు, చలాన్లు బాణాలై గుచ్చుకుంటున్నాయి. ఫైనాన్స్ కంపెనీలు పెనాల్టీలు, అధిక వడ్డీల రూపంలో జలగలై రక్తం జుర్రేస్తున్నాయి. ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు ఆగిన మూడుచక్రాల బతుకు బండిని చూసి వెక్కిరిస్తున్నాయి. వెరసి ఆటోవాలా బతుకు బండి ప్రయాణం అతుకుల గతుకుల్లో అస్తవ్యస్తంగా సాగుతోంది. రెండు తెలుగురాష్ట్రాలలో ప్రత్యేక పరిశ్రమలు పెద్దగా లేకపోవడంతో యువకులు, నిరుద్యోగులు ఉపాధి కోసం రాష్ట్రం విడిచి వలస వెళ్లే కన్నా ఉన్న ఊరిలో జీవించడం మేలు అన్న చందంగా చాలా మంది యువకులు నిరుద్యోగులు ఆటోరంగాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రవాణా రంగం అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారింది. ప్రతి జిల్లాలో సుమారు 50 వేల దాకా ఆటోలు ఉన్నాయి. వీటి మీద ఆధారపడి సుమారు 50 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రభుత్వం ఉపాధి చూపకపోయినా ఆటో నడపడం ద్వారా వచ్చే కాస్తంత ఆదాయంతో బతుకుబండిని లాగుతున్నారు. కరోనా తగ్గుముఖం పట్టి ఇప్పుడిప్పుడే ఆటో డ్రైవర్లు కోలుకుంటుండగా పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు చలాన్ల పేరుతో అస్త్రాలను ఎక్కుపెడుతున్నారు. అసలే పెంచిన పెట్రోల్ డీజిలు ధరలు అటో డ్రైవర్ల నడ్డి విరుస్తుండగా మరో వైపు అధికారుల వేధింపులు మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు పరిస్థితి తయారయింది.

కొత్తగా ప్రవేశపెట్టిన వాహనాల చట్టాలను అనుసరించి జరిమానాల ఛార్జీలు రూ.5 వేల నుంచి రూ. 10 వేలకు మించి ఉండడంతో నెలంతా సంపాదించిన సొమ్ము ఫైన్లకే చెల్లించాల్సివస్తోంది. దీనితో ఫైనాన్స్ కింద వాహనాన్ని తెచ్చుకుని నిర్వహించే డ్రైవర్ల పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. వచ్చినదంతా చలాన్లకే చెల్లించాల్సి రావడంతో నెలనెలా ఫైనాన్స్ కంపెనీలకు చెల్లించాల్సిన కంతులు పెండింగ్ పడుతున్నాయి. ఏ ఒక్క నెలకంతు గడువు కాలంలో చెల్లించకపోయినా రూ.వందలు, వేలు పెనాల్టీ పేరుతో ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. లేదంటే బండిని సీజ్ చేసి గోడానుకు తరలిస్తున్నారు. దాదాపు 70 శాతం



మంది ఆటో డ్రైవర్లు ఫైనాన్స్ కంపెనీలో లోన్లు తీసుకుని నడుపుతున్నారు. జిల్లాల్లో పదుల సంఖ్యలో అక్కడక్కడా ఆటో జీవనం సాగించలేక అప్పుల బాధతో బలవన్మరణాలకు పూనుకన్న ఘటనలూ తారసపడ్డాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితులు కుదుటపడే వరకు వారి పట్ల అధికారుల వేధింపులు, ఫైనాన్షియర్ల వేధింపులు లేకుండా అండగానిలిచి అదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. దేశీయ రవాణా అనేది దేశ ఆర్థిక వృద్ధికి కీలకం, రవాణా సమస్యలు మరియు మౌలిక సదుపాయాల జాప్యాలు దేశం యొక్క పురోగతిని ప్రభావితం చేస్తాయి. లారీ యజమానులు, డ్రైవర్లు లోడ్‌మెన్ సరుకులను నిర్వహించడంలో రవాణా చేయడంలో విశేషమైన సేవ అందిస్తున్నారు. వారికి ప్రభుత్వం మౌలిక కనీస సౌకర్యాలు కల్పించాలి. భద్రతా చర్యలపై డ్రైవర్లకు అవగాహన కల్పించాల్సిన గురుతర బాధ్యత లారీ యజమానులు, ప్రభుత్వంపై ఉంది. డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే ప్రమాదాలు తక్కువగా జరిగే అవకాశాలు ఉంటాయి. అధికశాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

రోడ్డు భద్రతపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా ప్రతి యేటా వారోత్సవాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'రోడ్డు భద్రత-ప్రతి ఒక్కరి బాధ్యత' అనే నినాదం మాటలకే పరిమితమవుతోంది. రయ్ రయ్ మంటూ వేగంగా దూసుకెళుతుండడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనలను పాటించాల్సిన బాధ్యత వాహనదారులపై ఉంది. నిబంధనలు పాటించడం లేదని విషయం ఇటీవల జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే తెలుస్తోంది. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం మానవ తప్పిదం అయితే, రోడ్లు, ఫ్లైఓవర్లను ఇంజనీరింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించకపోవడం ఆయా ప్రభుత్వ శాఖలది తప్పు. ఎవరో చేస్తున్న తప్పును మరొకరు బలవుతున్న పరిస్థితులు రోడ్డు ప్రమాదాల వల్ల స్పష్టంగా తెలుస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప తర్వాత మళ్లీ ఆ విషయానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. చాల నగరాలలో ఫ్లైఓవర్ల నిర్మాణంలో డిజైన్ లోపం ఉందనే విషయాన్ని రోడ్డు భద్రత అంశంపై పనిచేస్తున్న నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. దీనిపై సలహాలు, సూచనలు ఇస్తున్నా వాటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇంజనీరింగ్ తప్పిదాలు, రోడ్డు భద్రతా నిబంధనలను పాటించక పోవడంవల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో ఇంజనీరింగ్ తప్పిదాలు చాలా ఉంటున్నాయి. ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కలిగిస్తూ రోడ్డు నిబంధనలను పాటించాలనే విషయాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించాలి. అలాగే ట్రక్కు, రవాణా డ్రైవర్లకు ప్రతి పదిహేను కిలోమీటర్లకు టీ, కాఫీ, మంచినీరు, మజ్జిగ, లస్సి, బిస్కెట్, బ్రెడ్ బేకరీ ఐటమ్స్ అందుబాటులో ఉండాలి. ప్రతి యాభై కిలోమీటర్లకు కనీసం మూడు క్యాంటిన్లు ఉండేట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

డాక్టర్ ముచ్చుకోట సురేష్‌బాబు,
ప్రజాసైన్స్ వేదిక, అధ్యక్షులు

న్యాయమెప్పుడు?

- భోపాల్ గ్యాస్ బాధితుల ప్రశ్న
- మెరుగైన పరిహారం కోసం ఎదురుచూపు
- కోర్టుల అనుకూల తీర్పులపైనే ఆశలు
- కేంద్రం తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

భోపాల్: మాకు న్యాయం జరిగేదెప్పుడు? ఇంకెప్పటి వరకు ఈ నిరీక్షణ? కోర్టులు అనుకూలమైన తీర్పులు ఇస్తాయా? సముచిత పరిహారాన్ని ప్రభుత్వం కల్పిస్తుందా? దశాబ్దాలు గడుస్తున్నా మా బతుకులు బాగుపడవా? మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో అంతుపట్టడం లేదని భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితులు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రోజుకైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. నేటికీ వేలాది మంది కళ్లల్లో ఒత్తులు వేసుకొని ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 2010నాటి 345-347 క్యురేటివ్ పిటీషన్లలో తీర్పు తమకు అనుకూలంగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నారు. అమెరికాకు చెందిన డౌ రసాయన పరిశ్రమ నుంచి కేంద్రప్రభుత్వం పొందే అదనపు నిధుల నుంచి తమకు మెరుగైన పరిహారం లభిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. డౌ... యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ (యూసీసీ) యజమాని. 1984 డిసెంబరు 2-3 మధ్యరాత్రి జరిగిన విపత్తు వేలాది మంది ప్రాణాలను హరించింది. రాత్రికిరాత్రి నగర జనాభా సగానికి తగ్గింది. విషవాయువు కారణంగా బాధితుల భావితరాలూ తీవ్రస్థాయిలో ప్రభావితమయ్యాయి. నేటికీ అనేక రుగ్మతలు వారిని వేధిస్తున్నాయి. అరకొర సదుపాయాలతో వారు కష్టంగా జీవిస్తున్నారు.

భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితులకు న్యాయం కోసం దశబ్దాలుగా పోరాటాలు సాగుతున్నాయి. న్యాయపోరాటం క్రమంలో 2023, జనవరి 10-12 తేదీల్లో కోర్టు విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ఐదుగురితో కూడిన రాజ్యాంగ ధర్మాసనం కేసులను విచారించే క్రమంలో బాధితుల దుర్భర పరిస్థితులను అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది. కేసు పూర్వపరాలను అవగాహన చేసుకోవాలనుకున్నాగానీ ఏళ్ల తరబడి విచారణల్లో భాగంగా వేలాది పేజీలతో కూడిన 25 వాల్యూమ్‌లను పరిశీలించే పరిస్థితి ధర్మాసనానికి ఉండదు కాబట్టి మౌఖికంగా చెప్పిన ముఖ్యాంశాలనే కోర్టు పరిగణనలోకి తీసుకున్నది. మార్చి 14న సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసును విచారించింది. యూసీసీ నేపథ్య సంస్థల నుంచి అదనపు నిధులు పొందేందు కోసం కేంద్రం పెట్టుకున్న క్యూరేటివ్ పిటిషన్‌ను కొట్టివేసింది. బాధితుల కోసం బీమా విధానాన్ని తీసుకు రాకపోవడాన్ని దుయ్యబట్టింది. ఇంతటి నిర్లక్షమెందుకని చీవాట్లు పెట్టింది. రెండు దశాబ్దాలుగా ఈ వ్యవహారాన్ని సాగదీస్తూ బాధితులకు న్యాయం చేయని కేంద్రం తీరు నిరాశ పర్చినట్లు ఐదుగురు సభ్యుల సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వద్ద జమ చేసివున్న రూ.50 కోట్లతో పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది.

తప్పుదోవ పట్టించారా?

కేంద్రప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. డౌ రసాయన కంపెనీ తరపున సీనియర్ న్యాయవాది హరీశ్‌సాల్వే వాదించారు. వెంకటరమణి వాదనలను అడ్డుకొని కంపెనీ మరింత పరిహారం చెల్లించాలనుకోవడం లేదని చెప్పారు. తన వాదనకు బలం చేకూర్చే క్రమంలో సుప్రీం కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. 5,73,000 మందికిపైగా బాధితులకు నష్టపరిహారం అందిందని, రూ.50కోట్లు నిరుపయోగంగా ఉన్నట్లు చెప్పారు. 1989లో యూనియన్ కార్బైడ్ కంపెనీ సెటిల్మెంట్ ఫండ్ ఇచ్చిందని, పరిహారం పొందిన బాధితుల్లో 5,00,000 మంది స్వల్ప గాయాలతో బాధపడినట్లు కేంద్రం స్వయంగా అంగీకరించినట్లు తెలిపారు. దీంతో కేంద్రప్రభుత్వం అన్యాయంగా అదనపు నిధులు కోరుతోందని కోర్టు తొలుత భావించింది. కానీ తర్వాత వాస్తవాలను గ్రహించింది.

వాస్తవాలు: బాధితులకు రెట్టింపు పరిహారం ఇచ్చామన్న కంపెనీ వాదనలో ఏ మాత్రం నిజం లేదు. సెటిల్మెంట్ నిధి రూపేణ 1989 ఫిబ్రవరిలో కార్బైడ్ కంపెనీ 470 మిలియన్ డాలర్లు (రూ.710 కోట్లు) ఇచ్చింది. జరిగిన నష్టానికి సముచితమైన మొత్తాన్ని ఇవ్వలేదు. దీంతో భోపాల్ గ్యాస్ పీడిత్ మహిళా ఉద్యోగ్ సంఘటన్ (బీజీపీఎంయూఎస్) 1989, మార్చి 6న కోర్టులో సివిల్ రివ్యూ పిటిషన్ వేసింది. అదే క్రమంలో మరికొన్ని రివ్యూ, రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. కేంద్రప్రభుత్వం కోరినదాంట్లో ఐదోవంతు మాత్రమే కంపెనీ చెల్లించినట్లు ఆ దావాలు పేర్కొన్నాయి. 1988, జనవరి 29న భోపాల్ జిల్లా కోర్టులో వేసిన సవరిత దావాలో ఇదే అంశాన్ని కేంద్రం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 5,31,770 క్లెయిమ్‌లు నమోదు కాగా మొత్తం రూ.3,900 కోట్లు (మూడు బిలియన్ డాలర్లు) అవసరమని వెల్లడించింది.

సమర్థన: 1989, మే 4న సుమోటో ఉత్తర్వుల ద్వారా సెటిల్మెంట్ నిధిపై స్పష్టతను సుప్రీంకోర్టు కోరింది. తక్షణ ఉపశమనం అందించే దృష్ట్యా రాజీ జరిగిందని గమనించింది. అయితే మూడు వేల మరణాలు సంభవించాయని, 1,02,000 మంది గాయపడ్డారన్న ఊహాజనిత అంచనా క్రమంలో1,05,000 మంది బాధితులకు తక్షణ పరిహారం అందజేయాల్సి వచ్చింది. వారిలో కొందరిని మాత్రమే అప్పట్లో గుర్తించారు. కేంద్రప్రభుత్వం 1990-93లో సొంత నిధుల నుంచి రూ.360 కోట్లు కేటాయించి నెలకు రూ.200 చొప్పున 36 భోపాల్ వార్డుల బాధితులకు ఇచ్చింది. తద్వారా ఐదు లక్షల మందికి లబ్ధి చేకూరింది. 1991, అక్టోబరు 3న రివ్యూ పిటిషన్లలో తీర్పు వెలువడ్డాక క్లెయిమ్‌లు ఆరు లక్షలకు పెరిగాయి. 1992 నుంచి 2004 వరకు న్యాయ నిర్ణయాల ప్రక్రియ సాగింది. ఈలోగా 4,00,000 క్లెయిమ్‌లు అదనంగా వచ్చాయి. 5,73,000 మంది గాయపడ్డారని, 5,295 మరణాలు సంభవించాయని కోర్టులు అప్పట్లో నిర్ధారించిన ఫలితంగా 1,05,000 బాధితులకు పరిహారం అందింది. కానీ ఇవి ఊహాజనిత లెక్కలు కావడం వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉండటంతో నేటికీ న్యాయం కోసం ఎందరో బాధితులు ఎదురుచూస్తున్నారు.

భోపాల్ గ్యాస్ ప్రమాదం కేసులో

అదనపు నిధులకు సుప్రీం నిరాకరణ

- బీమా కల్పనలో నిర్లక్ష్యమెందుకని ప్రశ్న
- కేంద్రం క్యూరేటివ్ పిటిషన్ తిరస్కృతి
- ఆర్బీఐ వద్దనున్న రూ.50కోట్లతో పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని సూచన

న్యూఢిల్లీ: భోపాల్ గ్యాస్ దుర్ఘటన వల్ల జరిగిన పర్యావరణ-ప్రాణ నష్టానికి పరిహారంగా అదనంగా రూ.7,844 కోట్లను యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ (యూసీసీ) వారసత్వ సంస్థల నుంచి పొందడం కోసం కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్న క్యూరేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు దశాబ్దాలుగా ఈ సమస్య అపరిష్కృతంగా ఉండటం, కోర్టు తీర్పుల ప్రకారం చర్యలు లేకపోవడం, బాధితులకు బీమా కల్పించకపోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించింది. కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తీవ్రంగా నిరాశపర్చినట్లు పేర్కొంది. మీరు నిర్లక్ష్యంగా ఉండి బాధ్యతంతా యూసీసీదే అని నెపం నెట్టే ప్రయత్నాలు సరికాదని కేంద్రంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. 1984లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగింది. 3000 మంది మరణించగా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లింది. దుర్ఘటన బాధితులకు న్యాయం చేయని కేంద్రప్రభుత్వ తీరును జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరితో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం చీవాట్లు పెట్టింది. ఇప్పటివరకు బీమా విధానాన్ని ఎందుకు తేలేదని, ఇంతటి నిర్లక్ష్యం ఎందకని ప్రశ్నించింది. రెండు దశాబ్దాలుగా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటం తీవ్రంగా నిరాశపర్చిందని పేర్కొంది. పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించేందుకు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వద్ద జమ చేసిన రూ.50 కోట్లను వినియోగించాలని కేంద్రానికి సూచించింది. బాధితుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేగానీ యూసీసీపై రుద్దే చర్యలు తగవని పేర్కొంది. రివ్యూ తీర్పులో కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడమే కాకుండా కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ నెపాన్ని యూసీసీపై నెట్టడం ఏమిటని ప్రశ్నించింది. 'టాపప్' (అదనంగా డబ్బు) కోసం కేంద్రం దావా చేసేందుకు ఆధారమేమీ లేదని పేర్కొంది. 'రాజీ (సెటిల్మెంట్) చెల్లుబాటు అవుతుంది. లేదా ఏదేని మోసం జరగాలి. మోసం జరిగినట్లు కేంద్రం ఫిర్యాదు చేశయలేదు. గాయపడిన వారు, వ్యయాల చెల్లింపులనే చెబుతోంది. బాధితులకు వైద్య సౌకర్యాలు అనివార్యమని, వాతావరణ క్షీణత తప్పదని తెలుసు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఘటనాస్థలాన్ని డీటాక్సీపై చేయలేదని యూసీసీ ఆరోపిస్తోంది. రెండు దశాబ్దాలుగా ఏం చేసినట్లు? కేంద్రం తీరు నిరాశాజనకం. అంచనాకు మించి బాధితుల సంఖ్య, క్లెయిమ్‌లు ఉండవచ్చుగానీ సరిపడ అదనపు నిధులు కూడా ఉన్నాయి. అందుకే క్యూరేటివ్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నాం' అని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది.

విపక్ష ఎమ్మెల్యేల సస్పెన్షన్

గైర్‌సెయిన్ (ఉత్తరాఖండ్): ప్రతిపక్షాల ఆందోళనతో ఉత్తరాఖండ్ అసెంబ్లీ దద్దరిల్లింది. స్పీకర్ రీతు ఖండూరీ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన సభాహక్కుల తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో అసెంబ్లీలో మంగళవారం గందరగోళం చెలరేగింది. దీంతో సభను స్పీకర్ వాయిదా వేశారు. స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్ష, ప్రత్యేకించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలో వాగ్వాదానికి దిగారు. స్పీకర్ కుర్చీని నిందించారు. అసెంబ్లీ కార్యదర్శి బెంచీపై నిలబడి నినాదాలు చేశారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ప్రశాంతంగా ఉండాలని, సభ నిర్వహణకు సహకరించాలని స్పీకర్ కోరినప్పటికీ ప్రతిపక్షాలు వెనక్కి తగ్గలేదు. దీంతో ఆందోళనకు దిగిన విపక్ష సభ్యులందరినీ స్పీకర్ ఒకరోజు సస్పెండ్ చేశారు. తర్వాత సభను వాయిదా వేశారు. ఉద్దంసింగ్ నగర్ ఎస్ఎస్‌పీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యుడు ఆదేశ్ చౌహాన్ ఇచ్చిన సభాహక్కుల తీర్మానాన్ని స్పీకర్ రీతు తిరస్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ తీర్మానాన్ని అంగీకరించలేనని ఆమె తెలిపారు. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో ఇలాంటి ప్రవర్తన సరికాదని తెలిపారు. తన నిర్ణయంపై విపక్షాలకు ఏమైనా సమస్య ఉంటే...చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

ఆస్కార్ ఘనతపై రాజ్యసభలో వెల్లువెత్తిన ప్రశంసలు

న్యూఢిల్లీ: ఆర్ఆర్ఆర్, ది ఎలిఫెంట్ విష్పరర్స్‌కు ఆస్కార్ అవార్డులు రావడంపై రాజ్యసభలో పార్టీలకు అతీతంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌తో పాటు కేంద్రమంత్రులు, ఎంపీలు ఆయా చిత్ర బృందాలకు అభినందనలు తెలిపారు. ధన్కర్ మాట్లాడుతూ... 'ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న ఆర్ఆర్ఆర్, ది ఎలిఫెంట్ విష్పరర్స్ చిత్ర బృందాలకు అభినందనలు. ఆస్కార్ విజయం భారతీయ కళాకారుల అపార ప్రతిభ, సృజనాత్మకత, నిబద్ధత, అంకితభావాన్ని ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రశంసలు ప్రతిబింబిస్తాయి. భారత చలనచిత్ర ఎదుగుదల గుర్తింపుకి ఆస్కార్ విజయం మరొక కోణం' అని అన్నారు. కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, అనురాగ్ ఠాకూర్, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, ఎంపీ కేశవరావు, బీహార్ ఎంపీ మనోజ్ కుమార్, ఉత్తర ప్రదేశ్ ఎంపీ సీమ ద్వివేది ఆస్కార్, ఏపీ ఎంపీ విజయసాయిరెడ్డి విజేతలపై ప్రశంసలు కురిపించారు. ఈ విజయాలు భారతీయ కళాకారుల ప్రతిభకు అద్దం పడతాయన్నారు. ఆస్కార్ గౌరవం అందరిదని, ఆస్కార్ పురస్కారం లభించిన ఆర్ఆర్ఆర్ చిత్రం, ద ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ నిర్మాణం వెనుక అనేక వందలమంది కళాకారులు, టెక్నీషియన్లు ఉన్నారని ఎర్కొన్నారు. ఈ గౌరవం వారందరికీ దక్కుతుందన్నారు. సృజనాత్మకకళకు కులం, మతం, భాష, ప్రాంతం అనే ఎల్లలు లేవని... ఉండకూడదన్నారు.

ఫ్లూ లక్షణాలతో మహిళ మృతి

వదోదర: గుజరాత్‌ను ఫ్లూ జ్వరం వణికిస్తోంది. హెచ్3ఎన్2 భయంతో రాష్ట్ర ప్రజలు వణికిపోతున్నారు. తాజాగా 58 ఏళ్ల మహిళ ఫ్లూ తరహా లక్షణాలతో వదోదరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించింది. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం వెల్లడించారు. హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా వల్లే ఆ మహిళ మరణించిందా అని విలేకరులు అడుగగా నమూనాలను పరీక్షల కోసం పంపామని, మహిళ మృతిపై రివ్యూ కమిటీ సమీక్షిస్తుందని ఆ అధికారి వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందున్న మహిళను మార్చి 11న సర్ శాయాజీరావు జనరల్(ఎస్ఎస్‌జీ) ఆసుపత్రికి తరలించారని, మార్చి 13న ఆమె మరణించిందని రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డీకే హెలయ చెప్పారు. మహిళ శరీరం నుంచి అన్ని నమూనాలను సేకరించామని, పరీక్షకు పంపామని ఆర్ఎంఓ తెలిపారు.

రాహుల్‌కు బాధ్యత లేదు: ఆర్ఎస్ఎస్

సామల్కా (హరియాణా): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరింత బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ సబలే సూచించారు. రాహుల్ ఇటీవల కాలంలో తరచూ తమ సంస్థపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. స్వలింగ వివాహాల విషయంలో కేంద్రం అభిప్రాయాన్ని ఆర్ఎస్ఎస్ అంగీకరిస్తోందని, ఆడ, మగ మధ్య వివాహం జరగడమే మంచిదని దత్తాత్రేయ చెప్పారు. ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నించగా అది రాహుల్ రాజకీయ అజెండా అని, ఆర్ఎస్ఎస్ రాజకీయ రంగంలో లేదని, సంఘ్‌తో రాహుల్‌కు పోటీయే లేదని సబలే తెలిపారు. 'రాజకీయ పార్టీ నాయకుడిగా రాహుల్ బాధ్యతగా మాట్లాడాలి' అని సబలే మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. బ్రిటన్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ భారతదేశాన్ని జైలుగా మార్చిన వారికి దేశంలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన చెప్పారు. ముస్లింలకు ఆర్ఎస్ఎస్ దగ్గరవడానికి ప్రయత్నిస్తోందా అని అడుగగా ముస్లిం మేధావులు, మత నాయకుల ఆహ్వానం మేరకే ఆర్ఎస్ఎస్ నాయకులు వారితో సమావేశమవుతున్నారన్నారు.

పరీక్షకు దుమ్మాతో...

బయటపడిన బాల్య వివాహం

ఔరంగాబాద్: పదో తరగతి పరీక్ష రాయాల్సిన ఓ విద్యార్థిని బాల్యవివాహం చేసుకుంది. ఈ ఘటన మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో చోటుచేసుకుంది. మహారాష్ట్రలో ఎస్ఎస్‌సీ పరీక్షలు జరుగుతున్నాయి. పదో తరగతి లెక్కలు పరీక్ష రాయడానికి వెళ్లిన విద్యార్థిని ఏకంగా ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకుందని అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. పార్లీ తహసీల్‌లో జరిగిన ఈ వివాహానికి పెద్దలుగా వ్యవహరించిన 13 మందిపైనా, హాజరైన 150-200 మంది అతిథులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. భారతదేశంలో అబ్బాయికి 21, అమ్మాయికి 18 ఏళ్లు నిండితేనే వివాహానికి అర్హులు. లేకపోతే చట్టప్రకారం నేరం. సోమవారం పరీక్ష రాయడానికి వెళ్లిన 16 ఏళ్ల బాలిక 24 ఏళ్ల అబ్బాయిని పెళ్లి చేసుకుంది. చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు అమ్మాయి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం

రాహుల్‌పై వ్యక్తిగత దాడి సరికాదు: పిట్రోడా



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి విదేశాల్లో ఆ పార్టీ భారత వ్యవహారాల అధ్యక్షుడు శ్యామ్ పిట్రోడా పూర్తి మద్దతుగా నిలిచారు. సాయం కోసం రాహుల్ ఏనాడు ఏ దేశాన్నీ ఆహ్వానించలేదని స్పష్టం చేశారు. అసత్యాలు, సమాచారంలోపం ప్రాతిపదికన ఉద్దేశపూర్వకంగానే రాహుల్‌పై వ్యక్తిగత దాడి చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలపై పార్లమెంటు బడ్జెట్ సమావేశాల మొదటిరెండు రోజులు తుడిచి పెట్టుకుపోయాయి. హిండెన్‌బర్గ్ వ్యవహారం నుంచి సభను పక్కదారి పట్టించడానికి అధికార బీజేపీ తెలివిగా రాహుల్‌పై ఎదురుదాడి ప్రారంభించింది. ప్రత్యేకించి స్వయంగా రాహుల్‌పై కేంద్రమంత్రులే వ్యక్తిగత దూషణకు దిగారు. రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీపై కాంగ్రెస్ సైతం ధీటుగా స్పందించింది. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ చేయాలని డిమాండ్ చేసింది. పిట్రోడా మంగళవారం వరుస ట్వీట్లతో రాహుల్‌ను బలంగా సమర్థించారు. 'రాహుల్‌గాంధీ లండన్‌లో చెప్పిన మాటలను వక్రీకరించవద్దు. అసత్యాలు ప్రచారం చేయడం ఆపండి. రాహుల్ ఏమి మాట్లాడారో మీకు తెలుసా? మీరు అక్కడ ఉన్నారా? వీడియో మీరు చూశారా? రాహుల్ ఏమి మాట్లాడారో నిజంగా మీకు తెలుసా? ఏ సందర్భంలో మాట్లాడారో విన్నారా?అందులోని ప్రధాన సందేశమేమిటి?' అని పిట్రోడా ప్రశ్నల వర్షం కురిపించారు. 'వాస్తవంగా రాహుల్ గాంధీ మాట్లాడిన విషయాలు చెబుతా వినండి. భారతదేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అత్యుత్తమమైనది. భారత్‌లో ప్రజాస్వామ్యం ఆందోళనకరంగా ఉంది. అది భారతదేశ సమస్య. దానిని మేము ఎదుర్కొంటాం' అని పిట్రోడా తెలిపారు. సాయం కోసం విదేశాలను రాహుల్ ఏనాడు ఆహ్వానించలేదని స్పష్టంచేశారు. రాహుల్ మాట్లాడే సమయంలో తాను అక్కడే ఉన్నానని వెల్లడించారు. మీడియా సహకారంతో ప్రజాప్రతినిధులు ఉద్దేశపూర్వకంగానే రాహుల్‌పై వ్యక్తిగత దాడికి దిగారని విమర్శించారు. రాజకీయంగా ఇది సరైంది కాదని అభిప్రాయపడ్డారు. అసత్యాలు ప్రచారం చేయడానికి ఎందుకో కొంతమంది ఆరాటపడుతున్నారని ఆరోపించారు. ప్రతిసారీ రాహుల్‌పై విమర్శలే చేయడంలో మీ ఉద్దేశాలేమిటని ప్రశ్నించారు. భారత్‌లో మనం చేయదగినవి ఉద్యోగ కల్పన, ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడం, హింసను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్య సేవలు వంటి అనేక ముఖ్యమైన అంశాలు ఉన్నాయని, వాటిని పక్కన పట్టి రాహుల్ గురించి అసత్యాలు మాట్లాడటం ఏమిటని నిలదీశారు. అనవసర విషయాలపై జాతీయ టీవీ చానెళ్లు సైతం ఎక్కువ సమయం, డబ్బు ఎందుకు వెచ్చిస్తున్నాయని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాహుల్‌పై అవాకులూ, చెవాకులూ ప్రచారం చేయడం అలవాటుగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. ఇది ఎంతమాత్రం అనుసరణీయం కాదని వ్యాఖ్యానించారు. ఏ విషయాన్నైనా మనం అవగాహన చేసుకొని మాట్లాడటం మంచిదని హితవు పలికారు. ప్రజల కోసం మనమంతా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మతోన్మాదం, నియంతృత్వంపై పోరు ఆగదు

- శాసనసభ్యుడిగా సంతోషంగా లేను
- ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎత్తిచూపడంలో ఒంటరినయ్యా
- సిబ్‌సాగర్ ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్

గుహవతి: ఒక శాసనసభ్యుడిగా తాను సంతోషంగా లేనని, ప్రజాసమస్యలను మరింత బలంగా, నేరుగా లేవనెత్తే అవకాశాన్ని కోల్పోయానని అసోంలోని సిబ్‌సాగర్ ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్ పేర్కొన్నారు. 2021లో జైలు నుంచే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీచేసి గెలుపొందడం ద్వారా సంచలనం సృష్టించిన ఒకప్పటి రైతు నాయకుడు, ఆర్టీఐ కార్యకర్త అఖిల్ గొగోయ్... పీటీఐతో మాట్లాడుతూ... ఇతర ప్రతిపక్షాలు నిశ్శబ్దంగా ఉన్నందున ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను విమర్శించడంలో, నిరసించడంలో తాను ఒంటరినయ్యానని తెలిపారు. గొగోయ్ స్థాపించిన రాజకీయ పార్టీ రైజోర్ దళ్... వనరుల కార్పొరేటీకరణ, నియంతృత్వ పరిస్థితి, మతపరమైన, అప్రజాస్వామిక పాలన వంటి అనేక సమస్యలకు వ్యతిరేకంగా పోరాడుతోంది. కార్యకర్తగా ఉన్నప్పుడు ప్రజల సమస్యల కోసం పోరాడే అవకాశం ఎక్కువగా ఉందా అని అడిగిన ప్రశ్నకు గొగోయ్ స్పందిస్తూ... 'కార్యకర్తగా ఉన్న రోజుల్లో నేను మరింత సంతోషంగా ఉన్నాను. ఇప్పుడు నేను శాసనసభ్యుడిని' అన్నారు. 'ఈ ఎమ్మెల్యే పదవితో నేను సంతోషంగా లేను. నేను కార్యకర్తను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా నేను పోరాడతాను' అని గొగోయ్ స్పష్టం చేశారు. 'అసోం అసెంబ్లీలో, ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే ప్రతిపక్షంలో నేను ఒక్కడినే. మాకు 51 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే రాజ్యసభ, రాష్ట్రపతి ఎన్నికల్లో చాలా మంది ప్రతిపక్ష సభ్యులు బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో తాను బీజేపీ బలపర్చిన అభ్యర్థికి ఓటు వేయలేదు... బీజేపీ మతతత్వ, కులతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నా' అని తెలిపారు. 2026లో మళ్లీ పోటీ చేస్తారా అని అడగ్గా... తన భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి ఎన్నికలు ఒక మాధ్యమమని చెప్పారు. తాను కచ్చితంగా ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 2026 ఎన్నికలలో పోరాడతానని స్పష్టం చేశారు. 2026లో గెలిచే అవకాశాలపై అడిగిన ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వడానికి నిరాకరిస్తూ... 'చూడండి... నేను ప్రొఫెషనల్ రాజకీయ నాయకుడిని కాదు... సాధారణ వ్యక్తిని, నేను ఎల్లప్పుడూ మతోన్మాదం, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడతా... భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తా... కాబట్టి ఎన్నికల్లో గెలవడం లేదా గెలవకపోవడం అనేది నాకు ప్రశ్న కాదు' అని గొగోయ్ స్పష్టం చేశారు. కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి (కేఎంఎస్ఎస్) పేరుతో రైతు సంఘం ప్రారంభించడం ద్వారా గొగోయ్ తన సామాజిక జీవితాన్ని ప్రారంభించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా అనేక రైతు సమస్యలపై పోరాడారు. భూమి హక్కులతో సహా అనేక సమస్యలపై అనేక ఆర్టీఐ దరఖాస్తులు, కోర్టు కేసులను దాఖలు చేశారు. అసోంలో అనేక కుంభకోణాలను బయటపెట్టారు. ఎన్‌హెచ్‌పీసీ రెండు వేల మెగావాట సుబన్‌సిరి హైడ్రో పవర్ ప్రాజెక్ట్, పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ రహదారులపై టోల్ గేట్‌లకు వ్యతిరేకంగా తన మద్దతుదారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలను కూడా నిర్వహించారు. 2019 డిసెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా సీఏఏ వ్యతిరేక నిరసనల్లో ప్రత్యక్ష పాత్ర పోషించినందుకు గొగోయ్‌ని ఎన్ఐఏ అరెస్టు చేసింది. గొగోయ్ సహా అతని ముగ్గురు సహచరులపై రెండు కేసులను ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. జైలులో ఉండగానే గొగోయ్ రైజోర్ దళ్‌ను స్థాపించారు. 2021 అసెంబ్లీ ఎన్నికలలో సిబ్‌సాగర్ స్థానం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం

పుదుచ్చేరి సీఎం రంగసామి

పుదుచ్చేరి: యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తన పాలనా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తుందని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి మంగళవారం తెలిపారు. మార్చి 9న లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సభను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ముగించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ఎలాంటి అవకాశాన్ని వదలబోము. విద్యార్థులకు విద్యను అందించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నాము. పరిశ్రమలను అభివృద్ధి చేయడం ద్వారా చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించడమే మా తదుపరి ప్రాధాన్యత' అని వివరించారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో తన సంప్రదాయ ప్రసంగాన్ని అందించినందుకు లెఫ్టినెంట్ గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపిన రంగసామి... కేంద్ర పాలిత ప్రాంతం 'ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు, సహకారంతో సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి సిద్ధంగా ఉంది' అని తెలిపారు. పుదుచ్చేరిలో గత ప్రభుత్వం (కాంగ్రెస్ నేతృత్వంలోని) 'పాలన, పుదుచ్చేరి అభివృద్ధిలో అనేక అవాంతరాలు' కలిగించిందని ఆరోపిస్తూ 'పాలనాపరమైన ఇబ్బందుల నుంచి బయటపడటం అంత తేలికైన పని కాదు' అని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పుడు నిష్ఫలంగా పడి ఉన్న ఆంగ్లో-ఫ్రెంచ్ టెక్స్‌టైల్స్ (ఏఎఫ్‌టీ), భారతి మిల్స్, స్వదేశీ కాటన్ మిల్లులు, సహకార స్పిన్నింగ్, చక్కెర మిల్లులతో సహా వివిధ పారిశ్రామిక సంస్థలను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని పేర్కొంటూ, ఈ పరిశ్రమలు సంపన్నమైన సంభావ్యతను కలిగి ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగాలు కల్పించడంతో పాటు పుదుచ్చేరి ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడమని అన్నారు. సేదరపేట, మరికొన్ని గ్రామాలలో విశాలమైన స్థలాలు అందుబాటులో ఉన్నందున అనేక కొత్త పరిశ్రమలను కూడా ప్రోత్సహిస్తామని ఆయన చెప్పారు.

తగ్గిన టోకు ద్రవ్యోల్బణం

3.85 శాతంతో రెండేళ్ల కనిష్ట స్థాయికి

న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో రెండేళ్ల కనిష్ట స్థాయి 3.85 శాతానికి క్షీణించింది. ఆహార వస్తువులు ఖరీదైనప్పటికీ, తయారు చేసిన వస్తువులు, ఇంధనం, విద్యుత్ ధరలు తగ్గుముఖం పట్టడం అందుకు దోహదం చేసింది. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రేటు తగ్గడం ఇది వరుసగా తొమ్మిదో నెల. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం జనవరిలో 4.73 శాతంగా ఉండగా, గత ఏడాది ఫిబ్రవరిలో 13.43 శాతంగా ఉంది. 'ముడి చమురు, సహజ వాయువు, ఆహారేతర వస్తువులు, ఆహార ఉత్పత్తులు, ఖనిజాలు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్, ఆప్టికల్ ఉత్పత్తులు, రసాయనాలు, రసాయన ఉత్పత్తులు, ఎలక్ట్రికల్ పరికరాలు, మోటారు ధరలు తగ్గుముఖం పట్టాయి. వాహనాలు, ట్రైలర్‌లు, సెమీ ట్రైలర్‌ల ధరలు తగ్గుముఖం పట్టడమే ఫిబ్రవరి 2023లో ద్రవ్యోల్బణం దిగిరావడానికి ప్రధాన కారణం' అని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. 3.85 శాతం డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం జనవరి 2021 నుంచి కనిష్టంగా ఉంది. టోకు ప్రాతిపదికన ధరల పెరుగుదల రేటు 2.51 శాతంగా ఉంది. ధరల పెరుగుదల రేటులో తగ్గుదల ప్రధానంగా అనుకూలమైన మూల ప్రభావం కారణంగా ఉంది. ఆర్థికవేత్తలు మాట్లాడుతూ ముమ్ముందు, నిత్యావసర ధరలను, టోకు ద్రవ్యోల్బణాన్ని మరింత తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఏదేమైనా, ఆహార ద్రవ్యోల్బణం భవిష్యత్తు వాతావరణ సంబంధిత పరిస్థితులు, సకాలంలో రుతుపవనాలపై ఆధారపడి ఉంటుంది. తయారీ వస్తువుల ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ, ఆహార వస్తువుల విషయానికి వస్తే జనవరిలో 2.38 శాతం నుంచి ఫిబ్రవరిలో 3.81 శాతానికి పెరిగింది. పప్పు ధాన్యాల ద్రవ్యోల్బణం 2.59 శాతం కాగా, కూరగాయల్లో (-)21.53 శాతంగా ఉంది. ఫిబ్రవరి 2023లో నూనె గింజల ద్రవ్యోల్బణం (-)7.38 శాతం. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం గత నెలలో 15.15 శాతం నుంచి 14.82 శాతానికి తగ్గింది.

పార్టీ శ్రేణులకు రాజకీయ సైద్ధాంతిక చైతన్యం అవశ్యం

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లవసేన్ గుప్తా

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు రాజకీయ సైద్ధాంతిక అధ్యయనం అవశ్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లవసేన్ గుప్తా ఉద్బోధించారు. పార్టీ కార్యక్రమంపై తిరుపతి సీపీఐ కార్యాలయంలో నాలుగు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పల్లవసేన్ గుప్తా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం పల్లవసేన్ గుప్తా మాట్లాడుతూ పార్టీ ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చ జరపాలని పుదుచ్చేరిలో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో తీర్మానించినట్లు చెప్పారు. అందులో భాగంగా జాతీయస్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు సైద్ధాంతికపరమైన అధ్యయనం కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. పార్టీ లక్ష్యాలు సాధించాలంటే రాజకీయ ఎత్తుగడలు, వ్యూహాలతో పాటు సిద్ధాంతంపై కార్యకర్తలు పట్టుసాధించాలని స్పష్టం చేశారు. దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ చైతన్యవంతులు కావాలని కోరారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యమాలతో పాటు పార్టీ ప్రణాళిక, సిద్ధాంతంపై అధ్యయనం చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పార్టీ నిర్ణయించుకున్న లక్ష్యాలు పూర్తి చేయడంలో రాజకీయ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో నాయకత్వం మరింత కృషి చేయాలని కోరారు. తిరుపతి ప్రాంతంలో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సీపీఐ విద్యావిభాగం బాధ్యులు జేవీ సత్యనారాయణమూర్తి, విశ్రాంత అధ్యాపకులు ఆచార్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చండీగఢ్‌లో 18, 19 తేదీల్లో
ఐజేయూ జాతీయ కార్యవర్గం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గం సమావేశం మార్చి 18, 19 తేదీలలో రెండు రోజుల పాటు చండీగడ్‌లో జరగనున్నట్టు ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 24 రాష్ట్రాల నుంచి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆయా రాష్ట్రాల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యే ఈ సమావేశాలలో మీడియా సమస్యలు, వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక మాధ్యమాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన చట్టంలోని నిబంధనల సవరణ, లేబర్ కోడ్ పేరుతో పత్రికా పరిశ్రమలో వేతన సవరణకు ఎగనామం పెట్టడం, మీడియాపై సమాజంలో సన్నగిల్లుతున్న విశ్వాసం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. చెన్నైలో జరిగిన పదవ ప్లీనరీ తీర్మానాల అమలుకు కార్యచరణ రూపొందిస్తామని వివరించారు. 23వ తేదీన దేశ వ్యాప్తంగా తలపెట్టిన 'సేవ్ జర్నలిజం' పిలుపును జయప్రదం చేయాలని ఐజేయూ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజుల సమవేశాలకు అతిథులుగా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్, శాసనసభ స్పీకర్ కుల్తర్ సింగ్ సంథ్‌వాన్, ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు హాజరవుతున్నట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కర్నూలులో దారుణం

- కోడల్ని, ఆమె తల్లిని హత్య చేసిన మామ
- కొడుకుతో కలిసి వారిపై కత్తితో దాడి
- తీవ్రంగా గాయపడిన కోడలి తండ్రి

విశాలాంధ్ర-కర్నూలు రూరల్: కర్నూలులో దారుణం చోటుచేసుకుంది. ఒక వ్యక్తి తన కోడలి ఊరికి వెళ్లి... కోడలితో పాటు ఆమె తల్లిదండ్రులను తన ఇంటికి పిలిపించుకొని మరీ వారి ముగ్గురిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో కోడలు, ఆమె తల్లి దారుణంగా హత్యకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని చెన్నమ్మ సర్కిల్ సమీపంలో చింతల మునినగర్‌కు చెందిన ప్రసాద్, కృష్ణవేణి దంపతుల కుమారుడు శ్రావణ్‌కు ఈనెల 1న తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన రుక్మిణితో వివాహం అయ్యింది. మంగళవారం ఉదయం వనపర్తి నుంచి రుక్మిణి తన తల్లిదండ్రులు రమాదేవి, వెంకటేశ్వర్లుతో కలిసి కర్నూలులోని భర్త శ్రావణ్ ఇంటికి వచ్చింది. వచ్చిన కొన్ని గంటల్లోపే గొడవ చోటుచేసుకొంది. దీంతో ప్రసాద్ తన కుమారుడు శ్రావణ్‌తో కలిసి కోడల్ని కొట్టి చంపాడు. ఆమె తల్లిదండ్రులపై కత్తులతో దాడికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో జరిగిన ఈ దారుణ ఘటనలో కోడలు రుక్మిణి (18), ఆమె తల్లి రమాదేవి (36) హత్యకు గురయ్యారు. కోడలి తండ్రి వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రావణ్ ఐసీఐసీ బ్యాంకులో కాల్ సెంటర్ నందు ఉద్యోగం చేస్తున్నాడు. అతని తండ్రి ప్రసాద్ ఇడ్లీ అమ్ముకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వివాహం జరిగి కనీసం రెండు వారాలు దాటకముందే ఇలాంటి దారుణ సంఘటన చోటుచేసుకోవడానికి కారణాలు... భర్తకు భార్యపై వచ్చిన అనుమానమా...? లేక మామకు కోడలి కుటుంబ సభ్యులపై కక్ష సాధింపా...? పోలీసుల విచారణలో తెలియవలసి ఉంది. నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్క్సిజమే ప్రత్యామ్నాయం: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కారల్ మార్క్స్ రాసిన పెట్టుబడి, కమ్యూనిస్టు ప్రణాళిక గ్రంథాలు సమాజగతిని మార్చివేశాయని గుర్తుచేశారు. మహోపాధ్యాయుడు, కమ్యూనిస్టు ప్రణాళిక రూపకర్త, కారల్ మార్క్స్ 140వ వర్ధంతిని గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జంగాల అజయ్‌కుమార్, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ మానవశ్రమ నుంచి పెట్టుబడి ఉద్భవిస్తుందని మొట్టమొదటిసారిగా సూత్రీకరించిన మహామేధావి కారల్ మార్క్స్ అని కొనియాడారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి...పోరాడితే పోయేదేమిలేదు... బానిస సంకెళ్లు తప్ప అని మార్క్స్ తన సిద్ధాంతం ద్వారా కార్మికులను, కర్షకులను ఏకం చేశారని గుర్తుచేశారు. మార్క్సిస్టు సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఇఫ్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నాయకులు నూతలపాటి చిన్న, ఆకిటి అరుణ్‌కుమార్, జంగాల చైతన్య, బందెల నాసర్ జీ, వలి, మంగా శ్రీనివాసరావు, రామ్‌ప్రసాద్, చెవుల పున్నయ్య, యశ్వంత్, సాయి, చిన్నపోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజంపై అధ్యయనం అవశ్యం

మార్క్స్ వర్ధంతిసభలో వనజ, శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచ గమనాన్ని మార్చిన మార్క్స్ సిద్ధాంతంపై అధ్యయనం అత్యవశ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. దోపిడీ, అసమానతలు, సామ్రాజ్యవాదం, ఫాసిస్టు శక్తుల అంతం కోసం యువత ప్రతినపూనాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గ పోరాటం ద్వారా సామ్రాజ్యవాద దోపిడీ నుంచి విముక్తి, సోషలిజం సాధ్యమని ప్రపంచ విప్లవాలు ద్వారా తెలుస్తున్నదని పేర్కొన్నారు. మహామహోపాధ్యాయులు కార్ల్‌మార్క్స్ 140వ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడలోని మార్క్స్, ఎంగెల్స్ విగ్రహాల వద్ద మంగళవారం సంస్మరణ కార్యక్రమం విగ్రహాల కమిటీ అధ్వర్యంలో జరిగింది. అక్కినేని వనజ, శ్రీనివాసరావు తొలుత విగ్రహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, యుద్ధ ఉన్మాదం వంటి సమస్యల పరిష్కారానికి మార్క్సిజం అవసరమని వనజ, శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు. మోదీ ప్రభుత్వం మతం, భాష పేరుతో విభేదాలు సృష్టిస్తున్నాదని విమర్శించారు. క్యాపిటల్ గ్రంథం, కమ్యూనిస్టు ప్రణాళికపై విశ్వవిద్యాలయాల స్థాయిలో చర్చ జరుగుతోందని తెలిపారు. కమ్యూనిజం ఓటమి తాత్కాలికమేనన్నారు. భవిష్త్ కమ్యూనిజానిదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అధికార పార్టీ నాయకులు తప్పుడు పద్ధతులు అవలబించారని విమర్శించారు. జనసాహితి కార్యదర్శి దివికుమార్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ ఫ్రెడ్రిక్ ఎంగెల్స్ ఇద్దర్నీ విడిదీసి చూడలేమని, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ఆలోచనా విధానం గొప్పదని కొనియాడారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గేయాలు ఆలపించారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, డి.రమాదేవి, ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, విశ్వేశ్వరరావు, వై.చెంచయ్య, జమలయ్య, మోతుకూరి అరుణకుమార్, కె.స్వరూపరాణి, పంచదార్ల దుర్గాంబ, నక్కా వీరభద్రరావు, రాజేంద్రప్రసాద్, యడ్ల కృష్ణకిషోర్, దడాల సుబ్బారావు, మూలి సాంబశివరావు, యూవీ రామరాజు, మన్నెం సుబ్బయ్య, తూనం వీరయ్య, పరగటి భాను, లంక గోవిందరాజులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య, నియంత్రణ పర్యవేక్షణపై
శ్వేతపత్రం విడుదల చేయాలి

ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్- కమిషన్ చైర్మన్‌కు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య, నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ ఏర్పడినప్పటి నుంచి తీసుకున్న నిర్ణయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు లేఖను ఏపీ పాఠశాల విద్య, నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ చైర్మన్‌కు మంగళవారం రాశారు. రాష్ట్రంలో పాఠశాల, జూనియర్ కళాశాల స్థాయిలో ప్రైవేటు-ప్రభుత్వ విద్య వ్యవస్థను పటిష్టపర్చడం కోసం జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కమిషన్‌పై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. లక్షల రూపాయల వేతనాలు, సౌకర్యాలతో పదవులు అనుభవిస్తూ విద్యను నియంత్రించలేని వారికి విద్యనందించలేని, పరిరక్షించలేని కమిషన్ అలంకార ప్రాయంగా మారిందా? అని ప్రశ్నించారు. విద్య వ్యాపారంగా మారడంతో ఫీజుల రూపేణ తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు పటిష్ట చట్టం తేవాలని నొక్కిచెప్పారు. ప్రైవేటు విద్యా వ్యాపారుల దోపిడీని, వాస్తవ పరిస్థితులను కోర్టు ముందుంచేలా నిర్దిష్టమైన వైఖరి అవసరమన్నారు. ఫీజుల నియంత్రణకు అసెంబ్లీలో ప్రత్యేక శాసనం చేసేలా చర్యలు తేవాలని, ప్రైవేటు విద్యాసంస్థల్లో పాఠశాల విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు అమలయ్యేలా పటిష్ట నియంత్రణ, పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేని విద్యను అందించేలా చూడాలని, భౌతిక, లైంగిక దాడులను నివారించాలని, విద్యార్థులకు ఆత్మహత్య ప్రేరేపణల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలు, కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది అర్హతలు, శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని లేఖలో నరహరి కోరారు.

ప్రయాణికురాలిపై టీటీఈ మూత్రం విసర్జన

కోల్‌కతా-అమృత్‌సర్ అకల్ తఖ్త్ ఎక్స్‌ప్రెస్‌లో ఘటన
నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

లక్నో: రైలులో టీటీఈ అసభ్యంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో మహిళా ప్రయాణికురాలి మీద మూత్రవిసర్జన చేశాడు. ఇటీవలి కాలంలో రైళ్లలో, విమానాల్లో ప్రయాణికుల మీద తోటి ప్రయాణికులు మూత్రవిసర్జన చేస్తున్న ఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. ఎయిరిండియా విమానంలో ఓ వృద్ధురాలిపై మూత్రవిసర్జన చేసిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా ఇప్పుడు రైలులో ప్రయాణికురాలి మీద టికెట్ కలెక్టరే మద్యం మత్తులో మూత్రవిసర్జన చేసిన ఘటన వెలుగు చూసింది. కోల్‌కతా-అమృత్‌సర్ అకల్ తఖ్త్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక మహిళపై డ్యూటీ లేని రైలు టికెట్ ఎగ్జామినర్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె ఆరోపించింది. మార్చి 13వ తేదీ రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు రైలు టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ) మున్నా కుమార్‌ను అరెస్టు చేసినట్లు ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) అధికారి మంగళవారం తెలిపారు. అతను మద్యం మత్తులో ఉన్నాడని, బీహార్‌లోని బెగుసరాయ్ నివాసి అయిన అతనిని సహరాన్‌పూర్‌లో టీటీఈగా నియమించినట్లు అధికారి తెలిపారు. అయితే ఘటన జరిగిన సమయంలో మున్నా కుమార్ విధుల్లో లేడు. అమృత్‌సర్‌కు చెందిన ఆ మహిళ తన భర్త రాజేష్ కుమార్‌తో కలిసి ప్రయాణిస్తోంది. ఈ హఠాత్ పరిణామానికి మహిళ లేచి... గట్టిగా కేకలు వేయడంలో చుట్టుపక్కల ఉన్న ప్రయాణికులు విని మద్యం మత్తులో ఉన్న టీటీఈని పట్టుకున్నారు. రైలు సోమవారం లక్నోలోని చార్‌బాగ్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే టీటీఈని జీఆర్‌పీకి అప్పగించారు. లక్నోలోని జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ నవరత్న గౌతమ్ పీటీఐతో మాట్లాడుతూ ప్రయాణికుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, అతను, అతని భార్య బీహార్‌లోని కియుల్ నుంచి అమృత్‌సర్‌కు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. జీఆర్‌పీ (చార్‌బాగ్ లక్నో) కి ఫిర్యాదు చేయడంతో చార్‌బాగ్ స్టేషన్ నుంచి కుమార్‌ను అరెస్టు చేసినట్లు గౌతమ్ తెలిపారు. ఘటన జరిగిన సమయంలో నిందితుడు మద్యం సేవించి ఉన్నాడా అనే కోణంలో విచారణ జరుపుతామన్నారు. గతవారం అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో తన సీటులో నిద్రిస్తున్నప్పుడు మద్యం మత్తులో ఉన్న విద్యార్థి మూత్ర విసర్జన చేశాడు.

శాకుంతలం సినిమా అద్భుతంగా వచ్చింది: సమంత

హైదరాబాద్: గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన శాకుంతలం సినిమా అద్భుతంగా ఉందని ఆ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సమంత పేర్కొంది. ఈ సినిమా గతేడాదే షూటింగ్ పూర్తి చేసుకున్నప్పటికీ విడుదలకు మాత్రం అడుగుడుగున అడ్డంకులే ఎదురయ్యాయి. ఇక ఏప్రిల్ 14న ఎట్టి పరిస్థితుల్లో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ పక్కాగా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ సినిమాపై మంచి అంచనాలే క్రియేట్ చేసింది. కాగా తాజాగా సమంత సినిమా చూసిన అనంతరం ఇన్‌స్టాలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. శాకుంతలం చూశానని, సినిమా చాలా అద్భుతంగా వచ్చిందని చెప్పింది. 'మన పురాణాల్లో గొప్ప కథల్లో ఒకటైన శాకుంతలం కథకు గుణశేఖర్ గారు ప్రాణం పోశారు...బలమైన భావోద్వేగాలతో రూపొందిన చిత్రమిది... కుటుంబ ప్రేక్షకులు ఆ భావోద్వేగాలు చూసి కన్నీళ్లు పెట్టుకుంటారు... ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నాను... పిల్లలంతా ఈ మ్యూజిక్ వరల్డ్‌ను ప్రేమిస్తారు... ఫ్యామిలీ ఆడియోన్స్ అంతా కూడా పవర్ఫుల్ ఎమోషన్స్‌ను ఆస్వాధిస్తారు... ఈ సినిమాకు సంబంధించిన జర్నీని ఎప్పటికి మర్చిపోను... ఇలాంటి అద్భుతమైన సినిమాలో నన్ను భాగం చేసినందుకు దిల్‌రాజు, నీలిమా గుణలకు థాంక్స్' అంటూ సమంత పోస్ట్ చేసింది. మహాభారతంలోని శకుంతల-దుష్యంతుడి ప్రేమకథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. మలయాళ నటుడు దేవ్ మోహన్ దుష్యంతుడి పాత్ర పోషించారు. గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించింది. రుద్రమ దేవి తర్వాత దాదాపు ఏడేళ్ల గ్యాప్ తీసుకుని గుణశేఖర్ ఈ సినిమాను రూపొందించాడు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, మాలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది

వేగంగా 'ఇండియన్-2' చిత్రీకరణ



చెన్నై: ప్రముఖ నటుడు కమల్‌హాసన్ హీరోగా భారతీయుడు చిత్రానికి సీక్వెల్‌గా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇండియన్-2 సినిమా చిత్రీకరణ వేగంగా సాగుతోంది. ప్రస్తుతం తమిళనాడులోని కల్పాక్కమ్ డచ్ పోర్టులో షూటింగ్ కొనసాగుతోంది. కమల్‌హాసన్‌తోపాటు ఇతర నటీనటులపై వచ్చే కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇటీవలే యాక్షన్ అండ్ స్టంట్ డిజైనింగ్ టీమ్‌తో కమల్‌హాసన్ చర్చిస్తున్న ఫొటో ఒకటి నెట్టింట్లో హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, తెలుగు, తమిళ ప్రేక్షకులకు సుపరిచితులైన బాబీ సింహా, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇండియన్-2 చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్-రెడ్ జియాంట్ మూవీస్ బ్యానర్లపై ఉదయనిధి స్టాలిన్, సుభాస్కరన్ అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. కమల్‌హాసన్ నటించిన విక్రమ్ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు.

ఇక 'వన్డే' సమరం!

17న ముంబైలో భారత్-ఆసీస్ తొలి వన్డే

ముంబై: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని వరుసగా నాలుగోసారి గెలుచుకున్న ఆనందంలో ఉన్న టీమిండియా ఇక ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌పై దృష్టి సారించింది. మరోమూడు రోజుల్లో ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో తలపడనుంది. మార్చి 17 నుంచి ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ మూడు మ్యాచ్‌లు ఆడనంది. ముంబై, విశాఖపట్నం, చెన్నై వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సిరీస్‌కు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే భారత జట్టును కూడా ఎంపిక చేశారు సెలక్టర్లు. కానీ ఇప్పుడు గాయం కారణంగా అహ్మదాబాద్ టెస్టుకు దూరమైన శ్రేయస్ అయ్యర్.. తొలి వన్డేకు కూడా దూరమయ్యా డని తెలిసింది. దీంతో అతడి స్థానంలో జరగబోయే సిరీస్‌లో సంజూ శాంసన్‌ను ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. టీమిండియా కెప్టెన్ రోహిత్‌శర్మ కూడా తొలి వన్డేకు అందుబాటులో ఉండట్లేదు. దీంతో భారత జట్టుకు తొలి వన్డేలోనే హార్దిక్ పాండ్య కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇకపోతే ఈ మ్యాచ్‌లో డబుల్ సెంచరీ వీరులు శుభమన్ గిల్, ఇషాన్ కిషన్ అందుబాటులో ఉండటం కలిసొచ్చే అంశం.

వన్డేలకూ స్మిత్ సారథ్యం: భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టుకు స్టీవ్ స్మిత్ కెప్టెన్ బాధ్యతలను మోయనున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆఖరి రెండు టెస్టులకు దూరమైన ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వన్డే సిరీస్‌లో కూడా ఆడేది అనుమానమే. దాంతో, అతని స్థానంలో స్టీవ్ స్మిత్ జట్టును నడిపించనున్నాడు. ఈ విషయాన్ని ఆ జట్టు ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ ఒక ప్రకటనలో వెల్లడించాడు. 'వన్డే సిరీస్ కోసం ప్యాట్ కమిన్స్ భారత్ రావడం లేదు. అతను ఇంటి వద్దనే ఉండనున్నాడు. ప్రస్తుతం కష్ట సమయంలో ఉన్న కమిన్స్ కుటుంబానికి మేమంతా అండగా ఉన్నాం' అని మెక్‌డొనాల్డ్ ఒక ప్రకటనలో తెలిపాడు. తల్లి అనారోగ్యంతో ఉండడంతో కమిన్స్ రెండో టెస్టు అనంతరం స్వదేశానికి తిరిగి వెళ్లాడు. అయితే... ఆమె చనిపోవడంతో అతను అక్కడే ఉండిపోయాడు. కమిన్స్ గైర్హాజరీలో స్మిత్ మూడో టెస్టులో ఆసీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. తెలివైన వ్యూహాలతో జట్టును గెలిపించాడు. కాగా అహ్మదాబాద్ వేదికగా జరిగిన కీలకమైన నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. దాంతో, తొలి రెండు టెస్టులు నెగ్గిన టీమిండియా 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత జట్టు వరుసగా నాలుగోసారి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని దక్కించుకోవడంతోపాటు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించింది.

గాయాల బెడద: భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ఆసీస్ జట్టును గాయాలు వెంటాడుతున్నాయి. గాయంతో పేసర్ జోష్ హేజిల్‌వుడ్ టెస్టు సిరీస్ మొత్తానికి దూరమ వగా, ఇటీవలే గాయపడిన జై రిచర్డ్‌సన్ వన్డే సిరీస్‌కు దూరం కానున్నాడు. రిచర్డ్‌సన్ స్థానంలో నాథన్ ఎల్లిస్‌కు చోటు దక్కింది. స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ మార్ష్‌లు కూడా గాయంతో వన్డే సిరీస్ నుంచి తప్పుకున్నారు. ఇక మోచేయి గాయంతో చివరి రెండు టెస్టులు ఆడని ఓపెనర్ డేవిడ్ వార్నర్ వన్డేలకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

భారత్-ఆస్ట్రేలియా వన్డే సిరీస్ షెడ్యూల్...: భారత్, ఆస్ట్రేలియా జట్లు మూడు వన్డేల సిరీస్‌లో తలపడనున్నాయి. మార్చి 17న ముంబైలో తొలి వన్డే ప్రారంభం కానుంది. మార్చి 19న విశాఖపట్నంలో రెండో వన్డే ఉంది. చివరిదైన మూడో వన్డే మ్యాచ్ మార్చి 22న చెన్నైలోని చిదంబరం స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే రెండు దేశాల క్రికెట్ బోర్డులు వన్డే సిరీస్‌కు జట్లను ప్రకటించాయి.

పుజారా బౌలింగ్... మరి నేనేం చేయాలి? అశ్విన్

అహ్మదాబాద్: బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో చివరిదైన నాలుగో టెస్టు డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. అయితే మ్యాచ్ ముగియడానికి ముందు ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎన్నడూ బౌలింగ్ చేయని.. ఛతేశ్వర్ పుజారా, శుభ్ మన్ గిల్ చెరో ఓవర్ వేశారు. ఆ తర్వాత ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరించడంతో మ్యాచ్ ను 'డ్రా'గా అంపైర్లు ప్రకటించారు. దీనిపై ట్విట్టర్ లో స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, పుజారా మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. పుజారా బౌలింగ్ చేస్తున్న ఫొటోను ట్వీట్ చేసిన అశ్విన్... "మరి నేనేం చేయను.. జాబ్ వదిలేయమంటావా?" అని క్యాప్షన్ ఇచ్చాడు. దీనికి పుజారా బదులిస్తూ... "అలా కాదు... ఇది నాగ్‌పూర్‌లో నువ్వు వన్ డౌన్ బ్యాటింగ్ కు వెళ్లినందుకు ధన్యవాదాలు చెప్పడానికి మాత్రమే" అన్నాడు. పుజారా ట్వీట్ పై స్పందించిన అశ్విన్... "నీ ఉద్దేశం ప్రశంసించదగినదే కానీ... ఇది ధన్యవాదాలు చెప్పడం ఎలా అవుతుందనేది నాకు అర్థం కావడం లేదు" అని చమత్కరించాడు. దీంతో "నీకు తగినంత విశ్రాంతి ఇవ్వడం వల్ల భవిష్యత్తులో అవసరమైతే నువ్వు మళ్లీ వన్ డౌన్ బ్యాటింగ్ కు వెళ్లవచ్చు కదా అని" అని చెప్పుకొచ్చాడు. ఇలా వీళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచిన అశ్విన్... మరో స్పిన్నర్ రవీంద్ర జడేజాతో కలిసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సంయుక్తంగా అందుకున్నాడు. ఈ సిరీస్ లో అశ్విన్ 25 వికెట్లు, జడేజా 22 వికెట్లు తీశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.